అది కక్ష - ఇది శిక్ష!

సికిందర్

నా బాస్ శ్రీ మఛీందర్ రావ్, 'బ్లేడ్' పత్రికాధిపతి, మొన్న మధ్యాహ్నమే ఫోన్ చేసి నన్ను పిలిపించి, ఎడిటర్ శర్మ మెట్లమీదనుంచి జారిపడి కుడికాలు విరగ్గొట్టుకున్నాడని చెప్పినప్పుడు, నేనంతగా చలించలేదు.

ఎందుకంటే, అలాంటిది నే నెప్పుడో వూహించాను. మెట్లని చూస్తే ఎక్కడలేని సరదా శర్మకు. ఎవరెస్టుని అధిరోహిస్తున్నంత ఉత్సాహం వచ్చేసి, వెంట ఎవరున్నా వదిలేసి, యెక్కుపెట్టిన బాణంలా దూసుకెళ్లి చేరుకుంటాడు పైకి. అలాగే కిందికి వచ్చేటప్పుడు కూడా. అలా వురకడంలోని ప్రమాదాన్ని నేను చాలాసార్లు హెచ్చరించాను, అతని వయసును దృష్టిలో పెట్టుకుని. కానీ అతనిలాటి జీవిత సత్యాల్ని చాలా తేలికగా తీసుకుంటాడు. అందుకే ఫలితం మొన్న చవిచూశాడు.

అతని ట్రాజడీ నాకు పెద్ద షాకింగ్ న్యూస్ కాలేదు.

కాసీ అతడి బాధ్యతల్ని నన్ను తీసుకొమ్మని బాస్ పిలిచి అన్నప్పుడు కలవరపడ్డాను. అది నేనూహించ రానిది! నేను కేవలం ఆ పత్రికకు రిపోర్టర్ని మాత్రమే.

"ఆతని మోకాలు మధ్యకి విరిగింది....మళ్ళీ అతకా లంటే ఆర్నెల్లు పడుతుందట. అంతకాలం పడకమీద వుండాలి. పడకమీంచి పత్రికను నడపలేడు, అవునా? అందుకని సుందర్, అతను తిరిగి యాక్షన్లోకొచ్చేవరకు పత్రికను నువ్వు చేపట్టు! ఎట్టి పరిస్థితిలోనూ కుంటుపడ కూడదు పత్రిక! పాలసీకి విరుద్ధం. నీమీద నాకున్న పూర్తి విశ్వాసంతో ఈ బాధ్యత నీ కప్పగిస్తున్నాను.... ఈ క్షణంలో రంగంలో దిగు!" బాస్ మాటలు నన్ను చకితుడ్ని చేశాయి, పదే పదే చెవిలో మోగుతున్నాయి-

ఇది నేను శ్యామల చెవిన వేసినప్పుడు ఆమె ఎంతో ఆనందపడింది. ఆమెని నేనెప్పుడు ఆనందంగానే వుంచ డానికి ప్రయత్నిస్తాను. ఆడవాళ్ళని ఆనందంగానే ఉంచాలి. అప్పుడే పుష్టికరమైన ఆహారం, మానసికా ఆరోగ్యం చేకూరుతాయి. రిపోర్టర్కి ఇవి రెండూ చాలా ముఖ్యావసరాలు. లేకపోతే అవకతవకలు జరుగుతాయి. నా ప్రయోజకత్వానికి మురిసిపోయి శ్యామల నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంటే తన మాటలతో, నిజంగానే ఇక నేను ఎడిటరు నన్నట్లుగా భ్రమలోపడ్డాను.

ఆ భ్రమలోనే నిన్న హాస్పిటల్నుంచి శర్మ ఫోన్ చేసినప్పుడు, "ఎవరు మీరు? మీరెవరో నాకు తెలియదు. ఇక్కడ నేను తప్ప మరో ఎడిటర్ ఎప్పుడూ లేరు!" అనేశాను.

శ్యామల పొగడ్తల వర్షంతో నన్నూపిరాడనీయ కుండా చేసింది చాలక, "మా చిన్న బాస్ కళకళ

లాడుతూ కలకాలం పడకలోనే గడపాలనీ అందరి దేవుళ్ళకూ మొక్కుకుంటున్నాను....” అంది తన మొక్కుబడి ఫలిస్తుందన్న నమ్మకంతో.

అలా నేనిప్పుడు—ఇక్కడ—ఈ సుప్రసిద్ధ పత్రికా ఆఫీసులో, శర్మ కూర్చునే అత్యంత గౌరవప్రదమైన స్థానంలో, చుట్టూ అంతులేని కాగితాల కట్టల మధ్య, చేతికింద మెరికలాంటి అసిస్టెంట్ ఎడిటర్ మోహన్ కుమార్‌తో, తదుపరి సంచికకు సన్నాహాలు పూర్తిచేస్తూ బిజీగా వున్నాను.

సమయం మూడున్నర దాటింది. మధ్యాహ్నం. ప్రక్క గదిలోంచి చిత్ర చేస్తోన్న టైపింగ్ మిషన్ టపటపలు తప్ప, ఆఫీసంతా నిశ్శబ్దంగా వుంది.

నేనూ మోహన్, ఆ వారపు అత్యంత సంచలనకర వార్త అనదగ్గ ఒక రాజకీయ నాయకుడి అవినీతి ఆరోపణలపై రిపోర్టును పరిశీలిస్తున్నాం. ఈ రిపోర్టుని లోకల్ పొలిటికల్ కాలమిస్టు రవికాంత్ ఫైలుచేశాడు. రవికాంత్ సిటీలో పేరు పొందిన జర్నలిస్టు. నేను క్రైమ్ రిపోర్టరుగా వుంటున్నాను. మరిద్దరు లోకల్ రిపోర్టర్లతో పాటు దేశ వ్యాప్తంగా విలేకర్లున్నారు మా పత్రికకు.

ఈ ఆరోపణలు వచ్చిన రాజకీయ నాయకుడు బద్ధ శత్రువు బాస్‌కు. శత్రువు నీతి నియమాలతో వుంటే బాస్ పట్టించుకోడు. వాళ్ళలో ఏమైనా గిల్టీ సీక్రెట్స్ వాసన చూశాడా, ఇక రచ్చకీడ్చి అపఖ్యాతిపాలు చేయకుండా వూరుకోడు.

బాస్ ఆదేశంపైనే రవికాంత్ ఈతన్ని రీసెర్చి చేసి ఈ రిపోర్టు ఫైలుచేశాడు. ఇది వచ్చే సంచికలో ముఖ

పత్రిక శీర్షికగా రావాలని చెప్పాడు బాస్. అందుకవసరమైన లేఅవుట్స్‌ని సిద్ధంచేస్తున్నాడు, అవతలి గదిలో ఆర్టిస్టు సుధాకర్. రేపుదయం మేటరు ప్రెస్‌కెళ్ళిపోవాలి.

మోహన్ తను చూస్తున్న కాగితాలు పట్టుకుని చటుక్కున లేచి చిత్ర గదిలోకి పరుగెత్తాడు. అతను ఏ క్షణంలో ఏం చేస్తాడో తెలియదు. అన్నీ చటుక్కున చేస్తాడు.

నేను మళ్ళీ కాగితాలమీదకి దృష్టిని మళ్ళిస్తూండగా ఫోన్ మోగింది....

తల తిప్పి దాన్నందుకున్నాను. "యస్, ప్లీజ్?" అన్నాను పరాకుగా.

"మిసెస్ సుందర్ స్పీకింగ్" అంది అవతలి గొంతు.

తేరుకున్నాను. "ఓహ్, చెప్పండి! ఏమిటి సంగతి?"

"మీకో శుభవార్త!" ఆమె గొంతులో చెప్పలేనంత ఆనందం వుంది.

నాకేదో తట్టింది.... ఉద్రేకపడ్డాను.

"ఓహ్, నిజంగానా? అప్పుడే!...ఎప్పుడు తెలిసింది?" అరిచాను.

"ఏమిటి తెలిసేది?" ఆమె గొంతు సీరియస్‌గా మారిపోయింది.

"అదే! మన మధ్యకి.... జ్యూనియర్ సోమసుందర్ రాబోతున్నాడని!"

"నాన్సెన్స్!"

ఉలిక్కిపడ్డాను.

"పిచ్చి వూహాలు మానండి!" మళ్ళీ అరుపు, "తెలివి

తెచ్చుకోండి! మనం ఒప్పందం చేసుకున్న 'అయిదు సంవత్సరాల ఆనందమయ జీవన కాలపరిమితి' ఇంకా పూర్తికా నేలేదు, అప్పుడే వాదెవడూ జ్యూనియరు సోమసుందరమంటూ మన మధ్య రావడానికి?"

నెమ్మదిగా తేరుకున్నాను. "మరి నువ్వు చెప్పే ఆ శుభవార్త ఏమిటి?"

"ఆ—శుభవార్త కాదు."

"నువ్వు సరిగ్గా వినలేదు."

"నేనీ రాత్రి పార్టీ యిస్తున్నాను...."

తికమకపడ్డాను. "పార్టీ యా? ఎందుకు? ఎవరికి?"

"అందరికీ....మనకు తెలిసిన వాళ్ళందరికీ! ఎందుకా— దేశం గర్వించదగ్గ మన పత్రికకి మీరు ఎడిటరు అయిన ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, నేనీ రాత్రి అందరినీ విందుకాహ్వానిస్తున్నాను....అర్థమైందా?"

అదిరిపడ్డాను. నా కళ్ళు తిరిగాయి.

"నీకు తల తిరిగిందా? అవతల కాలు విరగ్గొట్టుకుని వున్నాడే శర్మ!" ఆవేశంగా అన్నాను.

"మాటలు జాగ్రత్త! సంసారం ఈదలేక సతమతమయ్యే సగటు జీవిలా ఏమిటా ఏడుపు సంబోధన? వాట్ యువర్ లాంగ్వేజ్" బెదిరింపు.

నాకేమనాలో తోచలేదు.

"వాళ్ళందర్నీ రమ్మన్నాను. యెనిమిది గంటలకి రావడం ప్రారంభిస్తారు....మీరు ఏడుగంటలకల్లా ఇక్కడుండాలి, వింటున్నారా? మీ స్టాఫ్‌ని కూడా తీసుకు రండి, అర్థమైందా? మర్చిపోకండి...."

నా రక్తం కుతకుతలాడిపోయింది.

"నీకు తల తిరిగింది! కళ్ళు నెత్తికెక్కాయి! నిన్నూ

నన్నూ తన్ని తగలేస్తాడు శర్మ, ఈ సంగతి తెలిస్తే!"

"మీకా భయం అక్కర్లేదు. కాలు విరిగింది, తన్న లేదు. మంచంమీద వుండగా మన సంగతీ తెలియదు. ఆయనకా మంచంమీదనే శాశ్వత వాక్కులు ప్రసాదించమని నేనందరు దేవుళ్ళకూ మొక్కుకున్నాను.... మీకేం భయంలేదు. నా మొక్కుబడి ఫలిస్తుంది. మీరు వొచ్చేయండి ఏడుగంటలకి!"

నన్నింకేమీ మాట్లాడనియకుండా ఫోన్ పెట్టేసింది.

నాకేంచేయాలో పాలుపోలేదు. చెమటలు తుడుచుకున్నాను, చుట్టూ చూస్తూ. గదిలో ఎవరూ లేరు. ఈ సంభాషణ ఎవరూ వినలేదు. ఒక నిమిషం ఆలోచించాను. ఫోనెత్తి ఒక నెంబరు తిప్పాను.

అవతలి గొంతు మధురంగా పలికింది. "యస్, దిసీజ్ శ్రద్ధాంజలి నర్సింగ్ హోం ప్లీజ్!"

ఉలిక్కిపడ్డాను. "మిస్టర్ శర్మ కావాలి!" అనేశాను వెంటనే.

"ఏ శర్మ, సర్?"

"ఎందరు శర్మగార్లున్నారు మీ మంచాలమీద?"

"నల్గురున్నారు, సర్."

"ఇవ్వాళ ఎవరికైనా శ్రద్ధాంజలి ఘటించారా?"

"ఇంకా లేదు, సర్."

"అయితే వినండి.... నాకు కావలసిన శర్మ—శ్రీశ్రీ పుణ్యామూర్తుల విశిష్ట వేదాంత బాలకిషోర శివరామ శర్మ. మర్చిపోయారా? మళ్ళీ చెప్తాను...."

"అక్కర్లేదు, ఆగండి! మీరెవరని చెప్పాలి?"

చెప్పి ఆయాసం తీర్చుకున్నాను. శర్మ లైనులో కొచ్చాడు. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది....

"ఏం బాబూ! ఇప్పుడు గుర్తొచ్చానా? నేనంత పనికి రాని తక్కువై పోయానన్నమాట!" అన్నాడతను నిష్ఠూరంగా.

ధైర్యం తెచ్చుకున్నాను. "క్షమించండి, సర్. మీకు ఫోన్ చేయాలనే అనుకుంటున్నాను ఉదయంనుంచీ! ఇక్కడ పని తెమలటంలేదు. ఇవ్వాళ మీరెలా వున్నారు సర్?"

"ఆ మాట నువ్వడుగుతున్నావా, సుందర్?"

"నేనే, సర్? ఎందుకలా అన్నారు, సర్?"

"నువ్వు నా యోగ క్షేమాలు తెలుసుకోవడానికే ఫోన్ చేశావా, సుందర్?"

"నేను... నేను.... సర్, మీతో విషయం చెప్పాలి!"

"అలా చెప్పు! ఈ హిపోక్రసీ మాని, యెందుకు పిలిచావో తిన్నగా చెప్పు!"

గొంతు తడుపుకున్నాను. "సర్, మీపై ఆసక్తి నశించిందని కాదు! నా పరిస్థితిని అర్థంచేసుకోవడంలేదు మీరు.... టెన్షన్ సార్! నేనిప్పుడు పెద్ద ఆపదలో వున్నాను. మిమ్మల్ని ఎప్పుడైనా నొప్పించానా, సర్? ఏ విషయంలోనైనా? ఇప్పుడా ట్రాప్ లోనే పడ్డాను. దీనికి నేనే బాధ్యుడ్ని కాకపోయినా మీ మనస్తాపానికి నేనే కారకుణ్నవుతాను.... నన్నీ ఆపదనుంచి కాపాడండి సర్! మీరే నాకు దిక్కు. శ్యామల నా మాట వినటం లేదు—"

"ఏమంటోంది?"

"నేను సిగ్గుపడుతున్నాను.... సర్."

"అది పెళ్ళిచేసుకున్న పాపానికి! చెప్పు, ఏమంటోంది శ్యామల?"

గుండె ఆగి ఆగి కొట్టుకుంటోంటే గబగబా చెప్పేశాను. అతను విన్నాడు. చెమటలు తుడుచుకుంటూ మాటలకోసం చూశాను—

అప్పుడన్నాడు ఎంతో శాంతంగా. "అంతే కదా? అయితే విచారిస్తావెందుకు... వెళ్ళి దిగ్విజయం చెయ్ ఫో!"

"సర్!" అరిచాను.

"అవును, సుందర్. నాకంతా తెలుసు. నిన్న నువ్వు మాట్లాడిన తీరూ, ఇప్పుడు నీ శ్యామల ప్రవర్తిస్తున్న పద్ధతీ చూస్తే నాకంతా అర్థమైపోయింది. నేనెవరికీ అక్కర్లేదు. యిప్పుడు నా అవసరం యెవరికీ లేదు. ఎక్స్పైర్డు! అవుటాఫ్ సర్క్యులేషన్! కాలు విరిగితే నేశాటికి చేరుకున్నట్లు మీమీ లాభాలు చూసుకుంటున్నారు. చూసుకోండి! చేసుకోండి! మీ ఇష్టంవచ్చినట్లూ ప్రవర్తించండి! నన్నిక కలవరించకండి!"

"సర్, సర్, సర్, ఓహ్, సర్ ....ఎంతమాట!"

"అంతే సుందర్, ఇక నాతో మాట్లాడకు!"

"సర్, మీరిలా మాట్లాడితే అంతా వదిలేసి ఎక్కడికయినా వెళ్ళిపోతాను! నిన్న మతి పోగొట్టుకుని ఏదో అనేశాను! ఆనందంలో మతి పోగొట్టుకోరా, సర్? తర్వాత క్షమించమనీ అడిగాను కదా? ఇది అన్యాయం, సర్. మీ సలహాకోసం, మీ సహాయం కోసం మంచి మనసుతో నేనరిస్తోంటే మీరిలా అంటున్నారు....మీరు తప్ప నన్నీ ఆపదనుంచి కాపాడలేరు, సర్! ఆమె నా మాట వినదు. తన పంతం నెగ్గించుకు తీరుతుంది! తర్వాత ఎంత అభాసవుతాం! నేను అసహాయుణ్నయిపోయాను, సర్! ఈ పార్టీని ఆపాలి! నా పరువు కాపాడాలి! శ్యామలని కోప్పడి మీరెలాగయినా...."

“ఆమెను ఎందుక్కాపాడాలి?” అన్నాడు తను విసురుగా, “నిన్నెందుకు కాపాడాలి? నేనెవర్నిప్పుడు? సుందర్, మనమంతా ఒక కుటుంబంలా మెలిగాం. నీ శ్యామల నన్ను బాబాయ్ అని పిల్చి ఆప్యాయత చూపేది. ఇప్పుడు సహజంగానే స్వార్థం మేల్కొని బుద్ధి పోగొట్టుకుంటే నేనెందుకు అడ్డుపడాలి?”

“ఆడవాళ్ళకి బుద్ధివుండదు, సర్. ఒప్పుకుంటాను.”

“అందుకే పెళ్ళి వద్దురా బాబూ అన్నాను. విన్నావా? నేను చేసుకోలేదు. చూడు ఎలా వున్నానో శుభ్రంగా. ఇప్పుడు నా చుట్టూ చేరి గొల్లున ఏడుస్తూ నాకు నీరసం తెప్పించేవాళ్ళున్నారా? లేరు! న్యూసెన్స్ లేదు! ఏం చక్కా రెస్టు తీసుకుంటున్నాను. లాభాలున్నాయి, సుందర్, బ్రహ్మచర్యంలో వున్న సదుపాయాలు....”

“సర్, అంత నిగ్రహం నాకు లేదు. నేను అందరి లాంటి మనిషిని. బ్రహ్మచారులు కొందరే తేలుతారు. వాళ్ళు పొందని అదృష్టం....మీరు క్షమిస్తే....”

“ఏమిటి సుందర్?”

“పుష్టికరమైన ఆహారం, మానసికారోగ్యం, సర్.”

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

“ఐసీ....ఆహారం గురించి ఆలోచించేవాడు దున్నపోతై పుట్టుగాక!”

“సర్! అలాగే అనుకోండి! కానీ ముందు నన్నీ ఉపద్రవంనుంచి కాపాడండి!”

పెద్దగా నవ్వి “పెళ్ళి చేసుకున్న పాపానికి కొన్ని అనుభవించాలి, తప్పదు! నిన్ను ఆ పైవాడే కాపాడుగాక!” ఠక్కున లైను కట్ అయింది.

కొయ్యబారిపోయాను. మెదడు శూన్యంగా మారిపోయింది. చిత్ర కొన్ని కాగితాలు పట్టుకొచ్చి టేబుల్ మీద పడేసి వెళ్ళిపోయింది కావాలని నడుము ఊపుకుంటూ. తేరుకున్నాను. నడుములు! ఈ ఆడవాళ్ళకి నడుములెందుకిచ్చావురా భగవంతుడా! ఇచ్చినా ఊపమని ఎందుకన్నావు. పరీక్ష పెట్టడానికి! అన్యమనస్కంగా ఆ కాగితాలు చూస్తూ వుండిపోయాను. అప్పుడు నాకో పిచ్చి ఆలోచన వచ్చింది. పిల్లిని గదిలో బంధిస్తే పిచ్చిగా రెచ్చిపోతుంది. శ్యామలని కిరాయి మనుషులతో కిడ్నాప్ చేయించి, ఈ రాత్రికి యెక్కడైనా మాయం చేయాలన్పించింది....

ఫోన్ మోగి ఆలోచనల్ని చెదరగొట్టింది.

ఎత్తి రెస్పాన్స్ ఇచ్చాను.

"మీరు వెంటనే రావాలి!" అంది అవతల్నుంచి గొంతు.

ఆవేశపడ్డాను. "మళ్ళీ నువ్వా .... నీ కళ్ళు నెత్తికెక్కాయి!"

"క్షమించండి, మిస్టర్ సుందర్, నేను నీరజని. మీ బాస్ సెక్రటరీని."

అదిరిపడి తేరుకున్నాడు. "ఓహ్, అయాం సారీ సిస్టర్!"

"డోంట్ మైండ్, మీరు వెంటనే రండి, బాస్ పిలుస్తున్నారు!"

ఆమె గొంతులో గాభరా పసిగట్టాను, "ఎందుకు? ఏం జరిగింది?"

"ఇక్కడికి రండి తెలుస్తుంది! బాస్ వెంటనే రమ్మన్నారు!"

"వచ్చేస్తున్నాను...." గబగబ లేచాను, "కానీ యెందుకో చెప్పకూడదా?"

ఆమె గాభరా మరింత ఎక్కువైంది. "బాస్ కారులో యెవరో టైంబాంబు పెట్టారు...." అందామె ఫోన్ పెట్టేస్తూ.

నా బైక్ తుపాకీలోంచి వెలువడ్డ గుండులా దూసుకు పోతోంది. ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.... టైంబాంబు! బాస్ కారులో! నా వళ్ళు గగుర్పొడిచింది.... ఇదెవరి దుశ్చర్య? యెవరు పాల్పడ్డారీ ఘాతుకానికి?

అప్పుడు జరిగింది అనుకోకుండా....

ఎలా జరిగిందో నాకు తెలియదు! కానీ నేను బ్రేకు వేశాను. ఎందుకో ఆగలేదు. అంత వేగంతోనూ వెళ్ళి నా బైక్ ఎదురుగా మలుపు తిరుగుతోన్న బస్సును గుద్దేసింది. నేను గాలిలో కెగిరి కొన్ని చుట్లు తిరిగాను—

2

తిరిగి కళ్ళు తెరిచినప్పుడు, ఆ గదిలో చాలామంది కన్పించారు.

కంగారుగా లేచి కూర్చోబోయాను, ఓ చెయ్యి నన్నాపింది.

"పత్రికా సంపాదకులు శ్రీయుతు సోమసుందర్ గారికి శ్రద్ధాంజలి నర్సింగ్ హోం ఘన స్వాగతం!" విన్పించాయి మాటలు.

తల తిప్పి చూశాను. ప్రక్క బెడ్ మీద శర్మ కన్పించాడు, నవ్వుతూ.

"ఇద్దరం ఇక్కడేనా?" అడిగాను.

తలూపాడతను. "గది కూడా ఒకటే, మంచాలే వేరు."

బాధగా మూలిగి తల తిప్పుతున్నాను. అప్పుడు కన్పించింది శ్యామల, నా తల ప్రక్కన, ఆత్రుతగా చూస్తోంది. చేతో నుదురు త డు ము తూ, "యెలా వున్నారు?" అనడిగింది ఆందోళనగా.

"ఫైన్" అన్నాను, నన్ను నేను చూసుకుంటూ. తలకి, కాళ్ళకి, చేతులకి కట్లున్నాయి. వళ్ళంతా నొప్పులుగా వుంది.

అక్కడే వున్న నర్సు డాక్టరు కోసం వురికింది.

అప్పుడు కదిలి వచ్చారు వాళ్ళు, కిటికీ దగ్గరనుంచి— మా బాస్, ఆయన సెక్రటరీ నీరజ, బాడీగార్డు రాబర్టు, అతని మనుషులిద్దరు....

బాస్ ప్రక్కనే కుర్చీలో కూర్చుంటూ నన్ను చూశాడు. ఆయన కళ్ళు ఒక్కసారి జీవం నింపుకున్నట్లయ్యాయి. తేలిగ్గా నిట్టూర్చాడు.

"యూ ఆర్ లక్కీ. ఇట్ వజ్ నేరో ఎస్కేప్" అన్నాడాయన.

తలూపి, "థాంక్యూ, సర్" అన్నాను.

ఆయన మళ్ళీ నిట్టూర్చి తలుపు వంక చూశాడు. డాక్టరు అప్పుడే హడావుడిగా వచ్చి, నన్ను ప్రశ్నలడిగి, ఓ ఇంజక్షను ఇచ్చి, "యూ ఆర్ క్వయిట్ ఆల్ రైట్" అన్నాడు నవ్వుతూ, "ఈ రాత్రికి వుండి రేపుదయం వెళ్ళిపోవచ్చు. అదృష్టంకొద్దీ మైనరు గాయాలతో తప్పించుకున్నారు. నో ఫ్రాక్చర్సు, నో బ్లీడింగ్. డోంట్ వర్రీ. ఉదయం లేచి మీరు తిరుగుతారు....

బాస్ వైపు తిరిగి మళ్ళీ అన్నాడు డాక్టరు. "ఓ.కే. సర్. ఇక ఫరవాలేదు. మీరు మాట్లాడుకోవచ్చు, ప్రైవసీ కల్పిస్తాం.... మిమ్మల్ని ఇక యెవరూ డిస్టర్బు

చేయరు...."

అతను నర్సుకి సైగ చేసి బయటికి దారితీశాడు.

రాబర్టు మనిషి తలుపు మూశాడు.

బాస్ సిగారు తీసుకుని వెలిగించుకుని, శ్యామలని చూసి చిరునవ్వు నవ్వాడు. ఆయన ముఖంలో ఆందోళన పూర్తిగా మటుమాయమైంది. నా వైపు తిరిగాడు.

"యూ టేకిట్ ఈజీ. పోలీసులు నిన్నిక డిస్టర్బు చెయ్యరు. వాళ్ళని ఫైర్ చేశాను. వాళ్ళు మనకి తోడ్పడరు. నువ్వింత గుడ్డిగా యెలా నడిపావు? బ్రేకు లేవని తెలుసుకోలేదా?"

కలవరపడ్డాను.

అప్పుడు రాబర్టు అన్నాడు. "అవును సుందర్, మీరా రిక్షాలో వెళ్ళి పడకపోతే ఇలా వుండేవారు కాదు. బస్సుకి ఢీకొట్టి మీరు ఎగిరివెళ్ళి ప్రక్కనుంచే పోతున్న రిక్షాలో పడ్డారు. అందులో దంపతులున్నారు. వాళ్ళమీద పడ్డారు. కేకలేస్తూ వాళ్ళలాగే కూర్చుండి పోయారు. మీ బైక్ ముందు భాగం బాగా దెబ్బతింది. పోలీసులు రాష్ డ్రైవింగ్ కింద మిమ్మల్ని బుక్ చేస్తామన్నారు. కానీ పరిశీలిస్తే అసలు మీ బండికి బ్రేకులేవని తెలిసింది...."

"బ్రేకులేవా!"

"లేవు, సుందర్ యెలా పోయాయో తెలుసా మీకు? అవి కావాలని తీసేసినట్లున్నాయి...."

"కావాలని తీసేశారా!"

"అవును, కావాలని తీసేశారు. బండిని విడిపించుకుని గ్యారేజివాళ్ళ కప్పగించాం. రిపేరులో వుంది. మీ బండికి బ్రేకులేకపోవడం, బాస్ కారులో బాంబు

వుండడం—ఈ రెంటికీ సంబంధముందనిపిస్తోంది...."

ఉలిక్కిపడ్డాను. టైంబాంబు! దాని గురించే మర్చిపోయాను. చటుక్కున బాస్‌ని చూశాను. "సర్, మీరెలా వున్నారు? అది విని నా ప్రాణా లెగిరిపోయాయి...." అన్నాను ఆందోళనగా.

ఆయన తేలిగ్గా నవ్వాడు. "డోంట్ యూ బాదర్. అది కూడా నేరో యెస్కేపే."

"బాస్ కారులో టైంబాంబు బానెట్‌లో కనిపించింది" రాబర్టు చెప్పుకుపోతున్నాడు, "ఒంటిగంటకు ఆయన గుల్జారు హావుస్‌లో జైనేంద్ర జైన్ కుమార్తె పెళ్ళికి వెళ్ళారు. కూడా నేనూ వున్నాను. మూడు గంటలకి తిరిగి వచ్చేశాం. డ్రైవరు కార్బరేటరు ట్రబులిస్తోందని బానెట్ తెరిచి చూశాడట—అప్పుడే అది కనిపించి నా దగ్గరకి పరుగెత్తుకొచ్చాడు. రాంగ్ టైమింగ్, సుందర్. గుల్జారు హావుస్‌నుంచి ఇంటికి చేరుకునేందుకు పట్టే కాలాన్ని తప్పు అంచనా కట్టడంవల్ల ప్రమాదం తప్పింది. ఇరవై అయిదు నిమిషాలకి ఇగ్నైట్ కావల్సింది, నలభై నిమిషాలకి సెట్ చేయబడింది. గాడ్ సేవ్‌డజ్! ఇంకో పదినిమిషా లుండనగా డ్రైవరు చూశాడు. వెంటనే దాన్ని తీసి నేను డిఫ్యూజ్ చేశాను...."

"ఓహ్, ఇలా యెప్పుడూ జరగలేదు!" అన్నాను ఆందోళనగా.

"అవును. కానీ ఇప్పుడెవరీపని చేశారో తెలియడంలేదు. శత్రువులు పలువురు. యెవరని చెప్పగలం? కారు గుల్జారు హావుస్ ఎదుట పార్కు చేసినప్పుడే దాన్నెవరో ప్లాంట్ చేశారు. పావుగంటసేపు డ్రైవరు కారు వదిలి వెళ్ళానంటున్నాడు, సమీపంలోని హోటల్‌కి. అప్పుడే

జరిగింది ... నా మనుషుల్ని వెంటనే అక్కడికి పంపాను. ఇంకా రిపోర్టు రాలేదు...."

"పోలీసులకి తెలిపారా?"

"లేదు. మనకి వాళ్ళ అవసరమేమిటి? మనకి వాళ్ళతో మంచి డీలింగ్స్ లేవు. దీన్ని మనమే హేండిల్ చేయాలి. అయితే ఇప్పుడు నాకింకో అనుమానముంది...."

"ఏమిటి?"

"శర్మగారి ట్రాజడీ. ఆయన యాక్సిడెంట్ సహజం కాదనిపిస్తోందిప్పుడు...."

నేను ఉలిక్కిపడ్డాను.

శర్మ కంగారుగా చూశాడు. "ఎలా అంటున్నావు, రాబర్టు?"

"జరుగుతున్న సంఘటనల్ని చూస్తే అలాగే అనిపిస్తోంది...." చెప్పాడు రాబర్టు, "మనల్నందర్నీ, లేక మనలో కొందర్ని అంతంచేసే కుట్ర ఏదో జరుగుతోందని నా కనుమానంగా వుంది. మొదట మీరు. తర్వాత బాస్. ఆ తర్వాత సుందర్, ఇంకా ఆ తర్వాత....

"వెల్! మీకు యాక్సిడెంట్ జరగలేదు, జరిపించబడిందని చెప్పడానికిప్పుడు ఆధారాలు దొరకవు. మీరు మెట్లెక్కే పద్ధతి శత్రువుని ఆకర్షిస్తే సులభంగా కల్పించగలడు ప్రమాదాన్ని. మెట్లకడ్డంగా సన్నని, వెంట్రుకవాసి మందం తీగ కడితే చాలు, ఇలాటివి జరుగుతాయి. తర్వాత తీగ మాయమవుతుంది. మీరు కింద వుంటారు గాయాలతో. మీరెలా మెట్లెక్కుతారో ఆఫీసు బిల్డింగ్ లో వాళ్ళకి దాదాపు అందరికీ తెలుసు కాబట్టి మీరు కాలు జారారనే నమ్ముతారు. మరొకటి అనుమానించరు. మీకు కూడా అలాగే అనిపించి వుండాలి...."

"మై గాడ్! నా కళ్ళకేదో అడ్డుపడినట్లు గుర్తు లేదు!"

"మీరు కిందపడిపోయి స్పృహ తప్పారు. కానీ మీరిక్కడ ప్రాణాలతో వున్నారని తెలిసి రాలేదు మళ్ళీ వాళ్ళు. అంటే వాళ్ళకి మీ ప్రాణాలు అవసరం లేదు. అంగవైకల్యం కల్పించాలనుకుని వుంటారు. సుందర్ విషయంలో ఏదీ చెప్పలేం. బ్రేకులు తీ కా రం టే ప్రాణాలే తీయాలనుకున్నారు. ఏదేమైనా మీరంతా క్షేమంగా వున్నారు. మన సిస్టంని ఇప్పుడింకా కట్టు దిట్టం చేయాలి. ఈ రాత్రికి ఇక్కడ నా మనుషులు వీళ్ళద్దర్ని గార్డుచేస్తారు. బాస్‌ని నేను స్వయంగా గార్డు చేస్తున్నాను...."

"ఓహ్, వాళ్ళెవరో తెలుసుకోవాలి, రాబర్టు!"

"ఆ ప్రయత్నంలోనే వున్నాం...." అన్నాడు బాస్ కల్పించుకుని, "త్వరలోనే తెలుస్తుంది....మీరు వర్రీకాకండి. మీకేం ప్రమాదంలేదు. పూర్తి రెస్టు తీసుకోండి" బాస్ లేచి తిరిగి అన్నాడు, "ఒకటి మాత్రం గుర్తుంచుకోండి. నో పోలీస్, నో ప్రెస్, నో పబ్లిసిటీ! మనలాగే మన శత్రువు కూడా గుట్టుగా అనుభవించాలి!"

మేమంతా తలలూపాం. బాస్ తలుపు దగ్గరికి కదిలాడు. శ్యామల నన్ను చూసింది బెదురుగా. కళ్ళతో ధైర్యం చెప్పాను.

"నేనెంత భయపడ్డానో తె లి య దు మీకు!" అందామె.

నవ్వాను. "నన్నెంత బెదిరిస్తావో అంత భయపడ తావు! ఇవ్వాళ నీ పార్టీ...."

"వైవాడు నిన్ను కాపాదేడు!" శర్మ అందుకుని

అన్నాడు.

ఫోన్ మోగింది హఠాత్తుగా.

నీరజ గబుక్కున వెళ్ళి ఎత్తింది. అవతలి మాటలు వింటూ ఆమె ఉద్రేకపడసాగింది. మేం ఆదుర్దాగా చూస్తున్నాం. అప్పుడామె రిసీవరు విసిరికొట్టి గిరుక్కున తిరిగింది, పాలిపోయిన ముఖంతో—

బాస్ తలుపుదగ్గరాగిపోయి చూస్తున్నాడు.

నీరజ మాటలకోసం తడబడింది. "సర్....ఆఫీసు మీద యెవరో దాడి జరిపారట! ముగ్గురు ముసుగు మనుషులు! చిత్రనీ, మోహన్‌నీ బాగా కొట్టి, ఫర్నీచరు ధ్వంసంచేసి, ఫైళ్ళు తగులబెట్టి పారిపోయారట—"

3

ఈ వార్తను మర్నాడు అట్టాహాసంగా ప్రచురించాయి పత్రికలు.

రెండు ప్రభుత్వ పక్ష పత్రికలు—వ్యక్తుల, సంస్థల ఆంతరంగిక విషయాలతో చెలగాటమాడే ఇలాంటి పత్రికలకి ఇటువంటి గుణపాఠమే జరుగుతుందని వ్రాపోయాయి.

మరో దమ్ములేని పత్రిక—విర్రవీగి వగుచుట ఏల? అని వంత పాడింది.

ఒక తటస్థ పత్రిక — పత్రికా స్వేచ్ఛని హరించే ఇలాంటి పాశవిక కృత్యం ప్రజాస్వామిక మూలసూత్రానికే గొడ్డలిపెట్టు అని ఉద్ఘాటించింది.

ఇంకో వామ పక్ష పత్రిక — ఈ దురాగతానికి బాధ్యులైన దోషుల్ని వెంటనే పట్టుకుని శిక్షించకపోతే ప్రభుత్వం గద్దె దిగిపోవాలని హెచ్చరించింది.

ప్రెస్‌ని నివారించడం మాకు కష్టమే అయింది.

వాళ్ళప్పటికే ఆ ఫీ సు ను ఆక్రమించుకున్నారు. ఫోటోలు తీసుకున్నారు. మోహన్‌నీ, చిత్రనీ ఇంటర్వ్యూకి వేధించారు. బాస్ ఆదేశానుసారం వాళ్ళంగీకరించలేదు. అక్కడ్నించి బాస్‌మీదకీ దండయాత్రచేసి బలవంత పెట్టారు. బాస్ నోరు విప్పలేదు. నో కామెంట్ అనే శాడు. ఫోటోలు తీయడానికి కూడా తిరస్కరించారు.

ఇంతలో నా యాక్సిడెంట్ విషయం పోలీసులు బయట పెట్టేయడంతో, మొత్తం విలేఖరులంతా మిడతల దండులా వచ్చిపడ్డారు నర్సింగ్ హోంమీద! అక్కడున్న రాబర్టు మనుషులు ఏమీ చేయలేకపోయారు. అంత వరకూ తాము గాలిస్తూన్న ఎడిటరు శర్మ కూడా అక్కడే వుండటంతో, విలేకర్లింకా చెలరేగిపోయారు. అయితే మానుంచి ఒక్క మాటా రాబట్టుకోలేకపోయినా, మమ్మల్నిద్దర్నీ ప్రక్క ప్రక్క మంచాలమీద జాయింటుగా ఫోటోలు తీసుకుని మాత్రం ఉడాయించారు.

ఆ ఫోటో పత్రికలలో వచ్చింది. ఫ్లాష్‌లు జిగేలు మంటున్నప్పుడు అంత కలవరంలోనూ మే మి ద్ద రం జాగ్రత్తను విస్మరించలేదు, ఫోటోలకు ఇవ్వవల్సిన పోజు విషయంలో. దైన్యంగా, మరీ పేషంట్లలాగ కన్పించక, అప్పుడే అంతరిక్షంలోంచి సురక్షితంగా లాండింగ్ అయిన రోదసీ యాత్రికుల్లాగ నవనవలాడుతూ, ఇనుమ డించిన ఉత్సాహంతో ఫోజిచ్చాం.

మనసు ఎంతైనా కలవరపడనీ, పైకి నవ్వులు కురి పించు: చుట్టూ ఎంత ఇబ్బందికర వాతావరణమైనా వుండనీ, పైకి హుందాతనం కనబర్చు: అప్పుడు శత్రువు ఆత్మ విశ్వాసం సగం బలహీన మవుతుంది—అన్న బాస్ సూక్తిని అక్షరాల పాటిస్తాం.

రాత్రంతా నర్సింగ్ హోంలోనే గడిపి, ఉదయమే ఇంటికి చేరుకున్నాను. స్నానం చేసి ఈ పత్రికలన్నీ చూస్తున్నాను. రాత్రి ఆఫీసుమీద దాడి నన్నెక్కువ ఆందోళన పరుస్తోంది. రాత్రే మోహన్ కుమారు చెప్పిన దాన్నిబట్టి ఫర్నిచరు, ఇతర వస్తుసామగ్రికి చాలా నష్టం వాటిల్లింది. రేపు ప్రెస్ కి వెళ్ళవల్సిన మేటరు పూర్తిగా ధ్వంసం చేయబడింది. చాలా ఫైళ్ళూ, ఎక్కౌంటు పుస్తకాలూ కాల్చివేయబడ్డాయి. మోహన్ నీ, చిత్రనీ బాగా గాయపర్చారు. వాళ్ళిద్దరు వేరే హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.

ఆ దుండుగుల్లో ఎవరి ఆనవాలనీ వాళ్లు చెప్పలేకపోతున్నారు. వాళ్ళు తలమీదుగా ముసుగులేసుకున్నారు. వాళ్ళెవరై వుంటారు? ఎవరీ వెనుకవుండి దాడీలు జరిపిస్తున్నాడు? అదెవరైనా తన రహస్యాలు బయలయ్యాయన్న కక్షతో ఇవన్నీ చేయిస్తున్నాడని తెలుస్తోనే వుంది.

అయితే తన ఈ దురవస్థకు ప్రత్యక్ష కారకుడయిన ఏ రిపోర్టరుమీదా దాడి జరిపినట్లు వార్త లేదు. రవికాంత్ క్షేమంగానే వున్నాడు. మిగతా అన్నిచోట్లా అందరు విలేకర్లూ సురక్షితంగానే వున్నారు. ఒకవేళ ఏ రిపోర్టరయినా దాడికి గురయివుంటే, అతనింతవరకు ఫైలు చేసిన రిపోర్టునిబట్టి వాళ్ళలో ఎవరెవరికి ఈ దాడులు జరిపించే అవకాశముందో తెలుసుకునే వీలుండేది. అప్పుడా తెలిసిన పరిధిలో కొనసాగి శత్రువుని కనుక్కోవడం కష్టంగాకపోయేది.

కానీ అలాలేదు పరిస్థితి. పరిధి అనంతంగా వుంది— ఒకరిని అని గాకుండా అందరు విలేకర్లు పంపిన రిపోర్ట్సునీ

దృష్టిలో పెట్టుకుని చూడాలి — అందరిలో ఈ శత్రువుని కనుక్కోవడం దుస్సాధ్యం. తన మనస్తాపానికి కారకుడయిన అసలు విలేకరి మీద నే దాడి జరపకుండా తెలివిగా వ్యవహరించి తనని కాపాడుకుంటున్నాడు శత్రువు. ఎక్కడా ఏ క్లూ వదిలినట్లు ఇంకా తెలియ రాలేదు.

నేనూ రిపోర్టరునైనా, నామీద దాడి ఎడిటింగ్ బాధ్యతలు స్వీకరించినందువల్లేననిపిస్తోంది. పత్రిక నడువకుండా చేయడం వాళ్ళ ధ్యేయం కావచ్చు.

శ్యామల టిఫిన్‌కి పిలిచేవరకూ ఇలా ఆలోచిస్తూనే వున్నాను....

టిఫిన్ చేస్తున్నప్పుడామె మరింత విచారంగా, ముభావంగా కన్పించింది.

ఆమెను చూసి నేనన్నాను. "నాకు జరిగిందానికి విచారించవచ్చు, అది నీ ధర్మం. ఫరవాలేదు. కానీ ఆ ముభావమే తీరని అపరాధం...."

ఆమె చటుక్కున అంది. "ముభావం కాదు, నిస్సహాయత! రిపోర్టర్ల జీవితాలు ఇంత భయంకరంగా వుంటాయనుకోలేదు!"

"అది ఇన్నేళ్ళకు తెలుసుకున్నావా?"

"ఎప్పుడో తెలుసుకున్నాను, కానీ మీరు వింటేగా? ఆడవాళ్ళు డిస్కరేజి చేయకూడదు మగవాళ్ళని, ఎంకరేజీ చేయాలని చెవిలో ఒకటే పోరుతుంటారుగా?"

నవ్వాను. "వెల్, యూ సీ డియర్, నే నెందులోనైనా దిగితే అది ఆషామాషీ వ్యవహారంగా వుండదు. నీకు తెలుసు, సీరియస్‌గా తీసుకుంటాను. కాయశక్తులా

కృషి చేస్తాను. కృషిని గురించి ఎందరెందరో గొప్పవాళ్ళు ఎన్నెన్నో సూక్తులు చెప్పారు-ఏమిటి? అవన్నీ చదువుకుని నాతో మాట్లాడు!"

ఆమె మాట్లాడలేదు. గబగబా తినేసి లేచిపోయింది.

నేను నిదానంగా తిని లేచిపోయాను.

అప్పుడే బయట ఏదో కారు హారన్ వినిపించింది. రాబర్టు మెదిలాడు. వెంటనే వెళ్ళి తలుపుతీసి చూశాను. రాబర్టు అనుచరుడు కృపాల్ కారు దిగుతున్నాడు.

అతను పరుగున లోపలికొచ్చి ఉద్రేకంగా అన్నాడు. "మీరిక బయల్దేరాలి!"

"ఎక్కడికి?" అడిగాను, కూర్చోమని చెప్తూ.

"బాస్ అప్పగించిన మిషన్‌కి!" చెప్పాడు కృపాల్ కూర్చుంటూ, "రాబర్టు బాస్‌ని కాపాడుతున్నాడు. నేను మీ మిసెస్‌కి రక్షణగా వచ్చాను. మీరా థగ్స్‌ని పట్టుకోవడానికి వెళ్ళాలి .... వాళ్ళని పట్టుకోకపోతే, మిమ్మల్నిక కనిపించవద్దన్నారు బాస్!"

నవ్వాను. "మరి లీడ్ ఏమిటి?"

"లీడ్ —" తల గోక్కున్నాడు కృపాల్, "ఓహ్, నిన్న గుల్జారు హౌస్ దగ్గర నేనే వాకబు చేశాను. బాస్ కారు పార్కు చేసిన సమీపంలో ఒక పాన్ షాపు వుంది. మెర్సిడిస్‌లాంటి పెద్ద కార్లు సహజంగా యెవరి దృష్టినైనా ఆకర్షిస్తాయి. అక్కడింకా చాలా వెహికల్స్ నిలిచి వున్నాయి. కానీ పాన్ షాపువాడిని మాత్రం మన బాస్ కారే బాగా ఆకర్షించింది — అతను చాలా టాకేటివ్‌గా ఉన్నాడు — కార్ల గురించి తన కలలు పావుగంట విశదీకరించాడు — బాస్ వాళ్ళు కారు దిగివెళ్ళిపోయాక డ్రైవరు కారు ప్రక్కనే నిలబడ్డాడట.

కాని కాస్సేపటి తర్వాత మళ్ళీ చూస్తే అక్కడ లేడట. తర్వాత నిమిషంలోనే గబగబా వస్తూ కన్పించాడట, రోడ్డుదాటి. అప్పుడు చేతిలో ఏదో బ్యాగు వుందట..."

"ప్రొసీడ్!"

"అతడలా వచ్చి కారు బాయ్‌నెట్ ఎత్తి దాని చాటున ఉండిపోయాడట. పాపతను ఆ చర్యను ఏమీ అనుమానించలేదట. రెండు నిమిషాల్లోనే తిరిగి అతను బాయ్‌నెట్ మూసేసి జనంలో కలిసి వెళ్ళిపోయాడట.. మళ్ళీ కాసేపటికి ఎదురుగా ఓ హోటల్లోంచి వస్తూ కన్పించాడట....అయితే ఈసారి చాలా నిదానంగా తీరుబడిగా వచ్చి నిలుచున్నాడట."

"ఓహ్, వాళ్ళిద్దరు ఒక్కరు కారని పాపతనికి తెలియదన్నమాట!"

"తెలియదు. ఆ ఆగంతకుడు మన డ్రైవరు పైజామాలోనే, డ్రెస్సులోనే ఉన్నాడు. తలమీద క్యాప్ కళ్ళమీదికి లాక్కున్నాడు. అందువల్ల పాపతను పొరబడ్డాడు. కానీ ఆ ఆగంతకుడి జాడ అక్కడ్నుంచి తీయలేకపోయాం."

"అయితే ఈ లీడ్ పనికిరాదు.." అన్నాను సిగరెట్ వెలిగిస్తూ, "కుట్ర ఎలా జరిగిందో ఇది తెలుపుతుందేగానీ, కుట్రదారుల్ని పట్టివ్వదు."

"మీ ఆఫీసు పార్కింగ్‌లో కూడా విచారించాం. అక్కడ వాచ్‌మన్ ఉండడు. ఎవరైనా స్వేచ్ఛగా వచ్చి మీ బైకుకు బ్రేకు లూడదీయవచ్చు...."

నాకేదో తట్టింది. చటుక్కున అతన్ని చూశాను.

"లీడ్ దొరికింది, కృపాల్!" అన్నాను.

"ఏమిటది?" అడిగాడతను కలవరంగా.

"బాంబుని ప్లాంట్ చేసిన వాళ్ళు బాస్ కారు ని వెంటాడి వస్తారు, తమ ప్రయత్నం ఫలించిందో లేదో తెలుసుకోవడానికి, అవునా?"

"అవును, కానీ ఫలించలేదు...."

"ఫలించలేదు, కాబట్టి, దారిలో ఎక్కడా ట్రాఫిక్ జామ్ కావడంగానీ, జనం గుమిగూడడడంగానీ, అప్పు డందులోంచి తొందరగా బయటపడి పోవడానికి ప్రయత్నిస్తూ శత్రువుల వాహనం ఎవరి దృష్టినీ ఆక ర్షించే ప్రశ్నగానీ లేదు!"

"లేదు...."

"కానీ నా విషయంలో వాళ్ళ ప్రయత్నం ఫలిం చింది! కాబట్టి ఆ ప్రశ్న వుంది!" అన్నాను లేచి వెళ్ళ డానికి సిద్ధమవుతూ.

4

టాంక్ బండ్ పోలీస్ స్టేషన్ లో సబిన్ స్పెక్టర్ శివాజీరావ్ నన్ను శాంతంగా లోనికి రానిచ్చాడు. అప్పుడొక్కసారి అరిచాడు ఉగ్రుడయిపోయి.

"మీరా! ఎందుకొచ్చారిక్కడికి? ప్రవేశంలేదిక్కడ! చెక్కేయండి వెంటనే!"

బలవంతాన నవ్వాను. పోలీసులముందు నాకు నవ్వు రాదు.

"ఇన్ స్పెక్టర్, మన సిద్ధాంతాలే వ్యతిరేకిస్తాయి. వ్యక్తిగతంగా మనకే కక్షలూ లేవు."

"ఓహ్, ఇప్పు డెందుకొచ్చారు? చెప్పి చెక్కేయండి వెంటనే!"

"నిన్న నా యాక్సిడెంట్ గురించి కుతూహలం కలిగి వచ్చాను...."

అతను తీక్షణంగా చూశాడు. "మీకెందుకు కుతూహలం? మిమ్మల్ని బుక్ చేయలేదనా? మిష్టర్ సుందర్, ఐ హేట్ యూ! మిమ్మల్నీ, మీ బాస్‌నీ, మీ బ్లడీ పత్రికనీ, మీ ముఠాగట్స్‌నీ....ఐ హేట్ దెమాల్ బిటర్లీ!"

"అలాగే ఇన్‌స్పెక్టర్" అన్నాను సహనంగా, "మీరు అసహ్యించుకోండి! కానీ మానవతా దృష్టితో ఒక చిన్న సహాయం చేయండి. నిన్న నేను ఢీ కొట్టిన బస్ డ్రైవరెవరో, చెప్తే...."

అతను క్రూరంగా చూశాడు. "ఎందుకు? ఎందుకతను?"

"అతనికి ఋణపడి వున్నాను. త్రుటిలో నా ప్రాణాలు కాపాడలేదూ? అతడికంత తెలివిలేకపోతే నేనిలా వుండేవాడ్ని కాదు. నా కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అది నా ధర్మంగా భావించి వచ్చాను. మీరెంత పోలీసువారైనా మానవజన్మ ఎత్తినవారే. మీలో మానవత్వముంటుంది. ఆలోచించండి. నాకీ అవకాశం కల్పించండి. ఇంతకంటే కోరేదేమీ లేదు."

అతనొక్కసారి దిగిపోయాడు. ఏమనుకున్నాడో, ఇలా చెప్పాడు. "చార్మినర్ డిపో, APZ 9981 నెంబర్ బస్సు, రూట్ నెంబర్ 42, డ్యూటీలో వున్న డ్రైవరు పేరు శివరావు....ఇక చాలా? చెక్కేయండిక!"

నేను చెక్కేసి అక్కడికి దగ్గర్లోనే శాంతా నర్సింగ్ హోంముందు కారు దిగాను.

మోహన్‌కుమార్, చిత్ర అక్కడే చికిత్స పొందుతున్నారు.

ముందు మోహన్‌కుమార్‌ని కలుసుకున్నాను. అతని

పరిస్థితి బాగానే వుంది. పరామర్శించడం అయ్యాక నేనడిగాను.

"మోహన్, వాళ్ళు మిమ్మల్ని కొడుతున్నప్పుడు ఎవరి పేర్లయినా ఉచ్చరించడంగానీ, ఫలానావారికి సంబంధించిన పత్రాలు ఇమ్మని అడగడంగానీ జరిగిందా?"

లేదని తలూపాడు మోహన్, "వాళ్ళసలు మాట్లాడలేదు, దేనికోసం వెతకలేదు. చేతికందినవి నాశనం చేసి పోయారంతే!"

"వాళ్ళు వచ్చేముందు నువ్వెక్కడున్నావు?"

"నా టేబుల్ దగ్గరే కూర్చున్నాను."

"నీ కుర్చీ వెనుక కిటికీలోంచి కింద పార్కింగ్ ప్లేస్, రోడ్డుమీద ట్రాఫిక్ బాగా కనబడుతుంది...."

"కానీ వాళ్ళు వచ్చేముందు నేను కిందికి చూడలేదు. పారిపోతున్నప్పుడు కిందపడిపోయి వున్నాను. వెంటనే లేవలేకపోయాను....అప్పుడు లేచి వెళ్ళి కిందికి చూస్తే వాళ్ళవు వెహికల్ వుంటే కన్పించేదేమో .... కానీ నాకా ఆలోచన రాలేదు."

అతన్ని వదిలి ప్రక్క గదిలో చిత్ర దగ్గరికి వెళ్ళాను.

ఆమె నన్నే పరామర్శించింది నవ్వుతూ. లాంఛనాలు తారుమారయ్యాయి.

"మిమ్మల్ని యెక్కడ కొట్టారు?" అడిగాను కూర్చుంటూ.

"ఇక్కడ — నడుము మీద!" చూపిందామె, ముసి ముసిగా నవ్వుతూ.

"ఎందుకు కొడుతున్నారో మీరడగలేదా?"

"వాళ్ళు చెప్పే మూడ్‌లో లేరు. బిజీగా కన్పించారు. గబగబా కొట్టేసి వెళ్ళిపోయారు."

"వాళ్ళ ముఖాల్ని మీరు చూడలేదా?"

"లేదు. ముసుగు లాగడానికి ప్రయత్నించాను—కానీ నా చేతికి వాడి మెళ్ళో లాకెట్ వూడివచ్చింది...."

"దాన్నేం చేశారు?"

"అక్కడే ఆఫీసులో పారేశాను... ఏ మూలకి వెళ్ళి పడిందో తెలియదు."

చార్మినార్ డిపోలో డ్రైవర్ శివరావు అప్పుడే డ్యూటీ ఎక్కుతూ కన్పించాడు. కంట్రోలర్ నాకతన్ని చూపించాడు. అతని వయసు రిటైర్మెంటుకి దగ్గర్లో ఉంటుంది. నన్ను చూసి గుర్తుపట్టి అమితాశ్చర్యపోయాడతను.

అతన్ని దగ్గర్లోని కేంటిన్‌లోకి తీసుకెళ్ళాను.

టీ తాగుతూ అతను నా గురించి చాలా బాధ పడ్డాడు. నేనా అవసరం లేదన్నాను. తప్పు నాదేనని చెప్పి, నా ప్రాణాలు కాపాడినందుకు నేనెంతో ఋణపడి వున్నానన్నాను. నేనింత త్వరగా కోలుకున్నందుకు తన కెంతో ఆనందంగా వుందన్నాడు.

అప్పుడసలు విషయంలోకి దిగాను. "మీరు నాకు కొన్ని విషయాలు చెప్పి సహకరించాలి. నాకిది చాలా సీరియస్ వ్యవహారం కాబట్టి మీరు జాగ్రత్తగా ఆలోచించుకుని చెప్పాలి."

"ఏమిటది?" అని అనుమానంగా చూశాడతను.

"అది జరిగినప్పుడు అక్కడెంత ట్రాఫిక్ జామ్ అయింది? ఎంతసేపు అయింది? ఏ ఏ వెహికల్స్ వున్నాయి? మీరు గమనించారా?"

అతను తికమకగా చూశాడు. వెంటనే సర్దుకొని చెప్పాడు.

"ఓ పది నిమిషాలు ట్రాఫిక్ నిలిచిపోయింది.... పోలీసులు వచ్చి స్పాట్ ఎంక్వయిరీ జరిపి, మీ బండినీ నా బస్సునీ ప్రక్కకు జరిపేవరకూ ట్రాఫిక్ జామ్ అయింది. మా బస్సులో ప్రయాణీకులంతా దిగిపోయారు. ఎంత ట్రాఫిక్ ఆగిపోయిందో నేను గమనించలేదు. ఏఏ వెహికల్స్ వున్నాయో సరిగ్గా చెప్పలేనుగానీ, చాలా వరకు ఆటోలే వున్నాయి."

"నేను మీకెదురొచ్చినప్పుడు, నా వెనుక ఏదైనా వెహికల్ని చూశారా?"

"టర్న్ తీసుకుంటున్నప్పుడు ఎదురేమొస్తున్నాయో చూసుకోవడం ముఖ్యం. నేను ట్యాంక్‌బండ్ మీదనుంచి లిబర్టీ వైపు టర్న్ తీసుకుంటున్నప్పుడే ఊహించని విధంగా మీరు వచ్చి గుద్దేశారు. అదే క్షణంలో నేను బ్రేకు నొక్కేశాను. ఆ క్షణంలో నేను మిమ్మల్ని తిట్టుకుంటే క్షమించాలి. కానీ అప్పటికి నేను సగం టర్న్ తీసుకున్నాను. దాంతోనే ట్రాఫిక్ బ్లాక్ అయింది. ఆ సగం టర్న్ తీసుకుంటున్నప్పుడే మిమ్మల్ని రక్షించే ప్రయత్నంలో ఇంకా ముందుకి చూడలేదు—కానీ—"

"చెప్పండి."

"నేను బస్సాపేసి దిగుతున్నప్పుడు ప్రక్కనుంచి ఒక టాక్సీ దూసుకెళ్ళబోయింది—కానీ ముందుకెళ్ళే దారిలేక నా డోర్ ప్రక్కనే ఆగిపోయింది. నాకిప్పుడు గుర్తుకొస్తోంది....అది మీ వెనుకే వున్న రెండు ఆటోల మధ్యనుంచి ప్రక్కకు మళ్ళి దూసుకొచ్చింది...."

"అప్పుడేమైంది?"

"అదక్కడ్నించి వెళ్ళిపోయే తొందర్లో వుంది. డ్రైవర్ ఒకటే హారన్ కొడుతూంటే నేను కోప్పడ్డాను.

ప్యాసింజర్ అర్జెంట్ అంటున్నాడని అన్నాడతను. వెనుక సీట్లో ఒక్కడే వున్నాడు."

"అతడెలా వున్నాడు?"

"సరిగ్గా చూడలేదు. నల్ల కళ్ళద్దాలున్నాయి.... మెళ్ళో ఒక గొలుసు ఉంది, అంతే."

"చివరికేమైంది?"

"ఆ టాక్సీ అందరితోపాటే కదిలింది."

"దాని నెంబర్ గాని మీరు చూశారా?"

"అతను తొడ చరిచాడు. "ఆదంత లొల్లి చేస్తోంటే ఎవరి దృష్టి నాకర్షించదు? నాలాటి డ్రైవర్లకి అలవాటుగా నెంబర్లు చూసే గుణముంటుంది...."

"అది గుర్తుందా?"

"**APT 6385**—ఎలా మర్చిపోతాను? అతి తెలివి చూపించే బళ్ళని నేను బాగా గుర్తుంచుకుంటాను...."

అక్కడ్నుంచి నేను ఆఫీసుకు చేరుకునేసరికి పన్నెండున్నరయింది. డూప్లికేట్ కీతో తాళం తీసి లోపలికెళ్ళాను. అక్కడి దృశ్యం చూసి మనసు వికలమైంది. చెల్లాచెదురుగా వస్తువులు పడివున్నాయి.... కొన్ని విరిగి, కొన్ని పగిలి ముక్కలై, కొన్ని కాలి బూడిదై ....

ఆఫీసంతా వింత వాసన వేస్తోంది. అయిదు నిమిషాలు జాగ్రత్తగా వెతికి, ఒక బీరువా కిందినుంచి దాన్ని తీశాను. బంగారు రంగులో మెరుస్తోంది. బంగారపుదే. ఖరీదైన లాకెట్. గొలుసు తెగిపోయింది హుక్ వున్న చోట. బిళ్ళలో రహస్య అర లేదు. ఘనపదార్థం. దాని మీద స్వస్తిక్ గుర్తు ముద్రించి వుంది. ఇంకే గుర్తులు చెక్కిలేవు.

ఫోన్ అందుకొని ఒక నెంబర్ తిప్పాను.

నీరజ పలికింది అవతల్నుంచి. వెంటనే రాబర్టుని పిలవమన్నాను.

"హాలో, ఏమిటి సుందర్?" అన్నాడతను వచ్చి.

"APT 6385—ఈ టాక్సీ ఎవరిదో, ఎక్కడ తగలడిందో తెలుసుకొని చెప్పండి, ఇక్కడే కూర్చుంటాను!" అని ఫోన్ పెట్టేశాను.

అతని రియాక్షన్ని ఊహించగలను. కానీ ఇప్పుడేదీ వివరించే స్థితిలో నేను లేను. అతనికున్న కాంటాక్ట్స్ ద్వారా నేను కోరిన ఇన్ఫర్మేషన్ తెలుసుకొని ఇవ్వగలడు....

సిగరెట్ వెల్గించుకొని కుర్చీలో జారగిలబడ్డాను. ఆఫీసును చూస్తుంటే నాకే నమ్మశక్యంగావడంలేదు.

ఎవరీ చెలగాటమాడుతున్న శత్రువు?

ఫోన్ మోగి నా ఆలోచనల్ని చెదరకొట్టింది.

రాబర్టు అన్నాడు. "ఆ టాక్సీ ఓనరు పేరు కాంతారావు. డ్రైవరు కందస్వామి. కోఠి బస్ టెర్మినస్ ముందు స్టాండింగ్ ...."

ఫోన్ పెట్టేసి బయల్దేరాను. కానీ అక్కడి స్టాండింగ్లో ఆ టాక్సీ లేదు. మధ్యాహ్నం మూడున్నర వరకూ స్వామీ టాక్సీలో తిరిగిరాలేదు. నేనక్కడే గడిపాను. నేనతన్ని సమీపించగానే అతను డోర్ తీసి పట్టుకుని ఆశగా చూశాడు. అతనికి ముప్పై ఏళ్ళుంటాయి. నేను నవ్వి నా కారుని చూపించాను.

అతని ముఖం మాడిపోయింది. "మీకు కారుంటే నేనెందుకు, సార్?"

"కాలక్షేపానికి. అడిగింది చెప్పు!"

"ఏం చెప్పాలి, సార్?"

అతనికి చెప్పాను. ఈసారి అతని ముఖం ఎర్రబడింది. ట్రాన్సపడిపోయాడు.

"నిన్న నీ టాక్సీలో ప్యాసింజరు నా బండికి బ్రేకు లూడదీశాడు. నువ్వతన్ని మోసుకెళ్ళి ఒకచోట దింపే శావు, ఎక్కడదది?"

"నాకు తెలీదు!"

"అలా అంటే పోలీసులొచ్చేస్తారు .... చెప్పు, ఆ ప్యాసింజరు నన్ను వెంబడించమని నీకు బాగా డబ్బి చ్చాడు. అతన్ని నా ఆఫీసు ప్రాంతాల, గన్ ఫౌండ్రీలో ఎక్కించుకున్నావు. టాంక్ బండ్ దగ్గర నా యాక్సి డెంట్ చూపించి తీసుకెళ్ళి ఏ హోటల్లోనో డ్రాప్ చేశావు. చెప్పు—"

"సార్, నాకేం తెలీదు! మిమ్మల్ని వెంటాడమంటే నే నొప్పుకున్నాను! మీకు యాక్సిడెంట్ జరుగుతుందని నాకేం తెలుసు?"

"ఇప్పుడు తెలిసిందిగా, నువ్వు చెప్పకపోతే పోలీసు లొస్తారు."

"సార్, అంత పని చేయకండి! నే నేం ఎరుగను! నన్నిందులో ఇరికించకండి!"

"సరే, నీ కన్యాయం చేయను, చెప్పు!"

"హోటల్ మయూర్, సార్!"

ఒక సిగరెట్ తీసి వెల్గించుకున్నాను. "ఇప్పుడు నాతో రా!"

"ఎక్కడికి, సార్?"

"చెప్పిన చోటికి!" హూంకరించి కదిలాను.

5

రాజభవన్ సమీపంలోని హోటల్ మయూర్ కెదురుగా టెలిఫోన్ బూత్‌లోకి జొరబడి గబగబా ఒక నెంబరు తిప్పాను.

చీకటి పడిపోయింది. టైము ఏడవుతోంది....

నీరజ సమాధానమివ్వగానే రాబర్టుని పిలవమన్నాను. రాబర్టు రాగానే గబగబా చెప్పాను. "ముగ్గురు మనుషులు కావాలి, రాబర్టు. వెంటనే హోటల్ మయూర్ దగ్గరకి పంపండి! పావుగంటలో చేరుకోవాలి—"

"ఎందుకు?"

క్లుప్తంగా చెప్పాను.

"అలాగే సుందర్, వెంటనే పంపుతాను!" అన్నాడతను ఉద్రేకంగా.

"శ్యామల క్షేమంగా ఉందా?"

"క్షేమంగానే వుంది, సుందర్. డోంట్ వర్రీ."

ఫోన్ పెట్టేసి బయటకొచ్చి సిగరెట్ వెల్గించుకున్నాను. దూరంగా రోడ్డువారగా నా కారు, దాని వెనుక స్వామి టాక్సీ ఆగివున్నాయి. స్వామి టాక్సీలోనే వున్నాడు.

అతను నేను చూపించిన లాకెట్‌ని గుర్తుపట్టాడు. వంద రూపాయలు ఆశ పెట్టి అతన్నిక్కడికి తెచ్చినప్పట్నించీ ఇంతవరకు శత్రువు రాకకై ఎదురుచూశాను. ఇందాకే వాడు హోటల్ ముందు ఆటో దిగి వెళ్ళినప్పుడు స్వామి చూసి గుర్తుపట్టాడు.

అయితే అంతకుముందే నేను హోటల్‌లో అనుమానాలు కలక్కుండా ఆరాలుతీశాను. వాడు రూం 124 లో ఉంటున్నాడు. పేరు మిష్టర్ జాడో.

బెంగుళూరునించి వచ్చాడు. హిందీ, కొద్దిగా ఇంగ్లీషు తప్ప ఏదీ రాదు.

వెంటనే నా మనసులో మా బెంగుళూరు కరస్పాండెంట్ మిస్ ఉమ మెదిలింది. ఆ వెంటనే ఇటీవల రెండు నెలల కాలంలో పబ్లిష్ అయిన ఆమె నాలుగు ఆర్టికల్స్ మెదిలాయి. ఆమె చాలా ఫాస్టు రిపోర్టర్. ఇప్పుడు శత్రువు పైకి తేలాడు. ఆ నాలుగు రిపోర్టుల్లో ఒకదాంట్లో వున్నాడు. ఎవరతను? మిష్టర్ జాడ్జోని అడిగి తెలుసుకోవాలి....

నా ప్రక్కనే రివ్వున దూసుకొచ్చి ఒక టాక్సీ ఆగింది. యాదవ్, కామేష్, చందర్‌లు బయటికి దూకి వచ్చారు. యాదవ్ చేతిలో చిన్న బ్యాగు వుంది.

"ఏమిటి జరిగింది, సుందర్ భాయ్? మాకీ ఎందుకు పిల్చినారు?" అన్నాడు యాదవ్. అతను మహారాష్ట్రియన్. తెలుగు ఉచ్చారణ సరిగా రాదు. హైదరాబాదు ముసల్మానులా మాట్లాడతాడు. అతనితో నేను హిందీలోనే మాట్లాడతాను.

గబగబా అతనికి హిందీలో వివరించాను. తర్వాత ఇప్పుడేం చేయాలో చెప్పాను. వాళ్ళు రైటో అని పరుగు తీశారు పొజిషన్లు చూసుకోవడానికి.

స్వామీ టాక్సీ దిగిపోయి మా కారెక్కాడు. కామేష్ టాక్సీ ఎక్కి దాన్ని హోటల్ గేటు వారగా తెచ్చి ఆపాడు. యాదవ్, చందర్‌లు దాని ప్రక్కన చేరి సిగరెట్లు ముట్టించుకుని, ఏదో ముచ్చటించుకో సాగారు సీరియస్‌గా.

వాళ్ళు సిద్ధం అన్నట్లు చెయ్యూపగానే నేను బూత్‌లోకి దూరి ఫోన్ చేశాను. హోటల్ మయూర్‌కి

రింగ్ చేసి, ఆపరేటర్ పలగ్గానే రూం 124కి కలప మన్నాను.

కొన్ని క్షణాలు గడిచాక ఒక మగ గొంతు పలికింది హిందీలో....

"హాలో, కౌన్ హై? క్యాహోనా?"

నేను వెంటనే చెప్పసాగాను హిందీలో. "సాబ్... మీకు ప్రమాదం! ప్రమాదం ముంచుకొస్తోంది! వాళ్ళకు మీ గురించి తెలిసిపోయింది....పోలీసులు మీ కోసం వస్తున్నారు! ఆ బాంబుమీద మీ వేలిముద్రలు దొరికాయి! వాళ్ళాఫీసులో మీ లాకెట్ దొరికింది! ఆ టాక్సీవాలాని వాళ్ళు పట్టుకున్నారు! వాళ్ళిప్పుడు మిమ్మల్ని అరెస్టు చేయడానికి వస్తున్నారు సాబ్, పారిపోండి!"

"ఓ గాడ్! నేనేం చేయను?"

"పారిపోండి, సాబ్! మాటలలో టైం గడిచి పోతోంది! వెంటనే గది ఖాళీచేసేసి ద్వారకా దగ్గరికి రండి, మేం రిసీవ్ చేసుకుని మరోచోట దాచేస్తాం! త్వరగా సాబ్, త్వరగా....!"

తక్షణ ఫోన్ పెట్టేసి బయటకొచ్చాను.

నా గుండె వేగంగా కొట్టుకుంటోంది. నేననుకున్నట్టే జరుగుతోందా? అతని కిరాయి మనుషులిద్దర్లో ఏ ఒకరితో నా గొంతును పోల్చుకుంటాడు? పోల్చుకుంటే నేననుకున్నట్లే రియాక్టు అవుతాడా?

ఆత్రతగా చూస్తూ నిలబడ్డ నాకు, హోటల్ ఆవరణలో వేగంగా వస్తూ ఒకడు కన్పించాడు. చేతిలో సూట్ కేసువుంది. అతనే! వెంటనే నా టీముకి సైగ చేశాను. టాక్సీ చటుక్కున కదిలి ముందుకు వచ్చింది. అదే క్షణంలో జూడో బయటకొస్తూ దాన్నాపాడు.

అతను దగ్గరకొచ్చి డ్రైవరుకేదో చెప్పాడు. ఆ వెంటనే వెనుక డోర్ తీసి లోపలికి మారాడు.

కానీ టాక్సీ వెంటనే కదల్లేదు.

కొంత దూరంలో వున్న చందర్, యాదవ్‌లు మెరుపు వేగంతో కదిలారు. చెరోవైపునుంచి టాక్సీ వెనుక డోర్లు తీసుకొని లోపలికి జొరబడ్డారు. చందర్ చేతిలో ఏదో మెరుస్తూ లేచింది. అది జూడో తలమీద పడింది. ఆ తల వాలిపోయింది. ఆ మరుక్షణం యాదవ్ దగ్గర బ్యాగులోంచి ఒక సిరంజి బైటకొచ్చింది....

అప్పుడు టాక్సీ కదిలి వేగంగా దూసుకెళ్ళింది.

నేను నా కారువైపు పరుగుతీశాను శక్తికొద్దీ.

ఇదంతా కొన్ని క్షణాల్లో ముగిసిపోయింది.

6

రాబర్టు ఆ వచ్చిన అతిథిని కుతూహలంగా చూస్తున్నాడు. "గుడ్, నీట్ జాబ్! ఈ థగ్ యెవరి తాలూకా?"

జూడో కళ్ళు తెరిచి అయోమయంగా చూస్తున్నాడు. అతని కాళ్ళు చేతులు కట్టేసి, బాస్ బంగళాలోని ఒక అవుట్ హౌస్‌లో పడేశారు.

యాదవ్ తన బ్యాగులోంచి తన సామగ్రి తీసి ఏర్పాట్లు చేస్తున్నాడు. ఒక రేడియో మెకానిక్కులు వాడే సాల్డరింగ్ ఐరన్ తీసి గదిలోని ఒక ప్లగ్‌లో పెట్టాడు. అది వేడెక్కుతోంది. ఒక టేప్ రికార్డర్ తీసి మరో ప్లగ్‌లో పెట్టి, దాన్ని నేలమీద జూడో దగ్గరగా ఉంచాడు. తర్వాత ఒక హంటర్ తీసి ఛెళ్ళున విదిలించి, దాన్ని చందర్‌కిచ్చాడు.

ఆ తర్వాత సన్నితమైన కేశాలున్న ఒక కేమల్

బ్రష్ తీశాడు. దాన్ని చూసి సరదాగా నవ్వుతూ జూడో ముక్కు రంధ్రాల్లో పెట్టి నేర్పుగా తిప్పాడు. జూడో గిలిగింతలు పెట్టినట్లయి ఉక్కిరి బిక్కిరి అవుతూ, హాఠాత్తుగా తుమ్ములు ప్రారంభించాడు.

"శుభం!" అన్నాడు యాదవ్, బ్యాగులోంచి ఒక సీసా తీస్తూ. అందులో సగంవరకు గండుచీమలున్నాయి. పంచదార తింటున్నాయి. ఒక ఫోర్సెప్ కూడా తీసి పట్టుకొని, "నౌ ప్రొసీడ్!" అన్నాడు.

రాబర్టు ముందుకు వంగి జూడోని అడిగాడు హిందీలో.

"ఇప్పుడు చెప్పు, నువ్వెవ్వరి మనిషివి?"

"నేను చెప్పను! నాకేం తెలియదు!" అరిచాడు వాడు.

"ఎందుకీ పనులు చేశావ్?"

"నే నేం చేయలేదు!"

"చేశావనడానికి మా దగ్గర రుజువులున్నాయి, బుకాయించి లాభంలేదు."

"ఓహ్, నే నేం చేయలేదు! నే నేం బుకాయించడం లేదు!"

రాబర్టు నన్ను చూసి చిటికె వేశాడు. మేమిద్దరం బయటికి నడిచాం. సిగ్నలందుకుని లోపలవాళ్ళు ముగ్గురు విజృంభించారు. కొరడా ఛెళ్ళు ఛెళ్ళు మంటోంటే జూడో అరుపులు వినిపిస్తున్నాయి.

మేమిద్దరం బయట కుర్చీల్లో కూర్చున్నాం.

"మ్యాడ్ మేక్స్‌లో కొన్ని సీన్లు మర్చిపోలేం, సుందర్" అన్నాడతను, సిగరెట్ వెలిగించుకుంటూ.

ఆ సినిమా నేనూ చూశాను. మేమిద్దరం దాని గురించి మాట్లాడుకోసాగాం.

ఇంతలో జూడో పెడబొబ్బలతో పాటు నవ్వులు వినిపించాయి.

యాదవ్ అంటున్నాడు. "ఇవి గండుచీమలు, ఒక్కొక్కటి తీసి నీ ప్యాంటులోకి వదుల్తున్నాను. కాస్సేపట్లో నీ కింది భాగమంతా బొబ్బలెక్కిపోతుంది. ఆ తర్వాత ట్రిట్మెంటు లేకుండా గడపాలి వారం రోజులు.... సున్నిత భాగాలు డ్యామేజీ అయ్యాయా, నీ పని అంతే!"

"ఓహ్, ఆపండి! పాటిల్ .... పాటిల్ పంపాడు నన్ను!" జూడో అరుపు వినిపించింది గట్టిగా....

7

బాస్ కళ్ళు అగ్ని గోళాలయ్యాయి—

ఆ టేపులో జూడో మాటలు వింటున్నంత సేపూ ఆయన ముఖభావాల్ని చూడలేకపోయాం.

ఆయన ముఖం కఠినంగా మారి, చెప్పలేని క్రోధం, ప్రతీకార భావం కళ్ళల్లో మెరుస్తున్నాయి. పూర్తిగా విని మా అందరివైపూ తీక్షణంగా చూశాడు.

"డామ్ హిమ్! ఈ పాటిల్‌కి తగిన పాఠం నేర్పాలి, సుందర్!"

ఈ అరుపు విని నేను అదిరిపోయి నిటారుగా కూర్చున్నాను, "యస్, సర్!"

"వాడి సర్వనాశనం చూడాలి!" అన్నాడాయన, అదే కర్కశమైన గొంతుతో, "వాడు కుళ్ళి కుళ్ళి చావాలి! నువ్వేలా చేస్తావో నా కనవసరం, వాడికి పట్టించే గతి యెవరికీ చెప్పుకోలేనిదిగా వుండాలి! యూగగా అనుభవించాలి! నాకీ తృప్తినివ్వకపోతే నువ్వికి

కనిపించవు! ఆరమైందా? నీ ముఖం నాకు చూపించకూడదు! ఏ బాస్టర్డు నాకు అపకారం తలపెట్టి సుఖంగా వుండలేదు? గతంలో నా జోలికి వచ్చి ఆ సక్సేనా ఏమయ్యాడో తెలుసుగా? (కీర్తి దాహం—జనవరి'80) ఎవరు నా జోలికొచ్చినా గల్లంతే అవుతారు...."

తేరుకున్నాను. "నాపై విశ్వాసముంచండి, సర్."

"నువ్వు రేపే బయల్దేరు బెంగుళూరుకి!"

"అలాగే, సర్."

"ఎంతో అవసరమైతే తప్ప మిస్ ఉమతో రిస్కు తీసుకోకు."

"సాధ్యమైనంతవరకు ఒంటరిగానే చేస్తాను, సర్. అయితే ఇక్కడ కొంత నేను కోరినట్లు జరగాలి...."

"ఏమిటది?"

"జూడోని విడిచిపెట్టేయాలి, సర్. అంటే తప్పించుకునే అవకాశాన్ని కల్పించాలి. నేను బెంగుళూరు చేరుకుని మీకు ఫోన్ చేసి, నేనుంటున్న హోటల్, ఫోన్ నెంబరు తెలియజేస్తాను. అప్పుడు జూడోని విడిచిపెట్టేసి అతడు పారిపోయి రైలెక్కుతాడో, విమానము ఎక్కుతాడో కనిపెట్టి నాకు చెప్పాలి, సర్...."

బాస్ క్షణం నన్ను సాలోచనగా చూసి తలూపాడు.

"థాంక్యూ సర్, ఈ టేప్ నేను తీసుకుపోతాను" అంటూ లేచి రాబర్టుతో అన్నాను, "మీరు జూడోతో నన్ను కొన్ని ఫోటోలు తీయాలి. ఒక్కో కాపీ ప్రింట్స్ కూడా వెంటనే నాకివ్వాలి...."

అతను అయోమయంగా చూశాడు.

నేను మళ్ళీ బాస్ ని చూశాను. "సర్, ఇందులో నాకేదయినా సంభవిస్తే యెప్పటి మాట ప్రకారం

-్యామల బాధ్యత మీరు తీసుకుంటారనుకుంటాను...."

"ఆ విషయంలో నువ్వు నిశ్చింతగా ఉండొచ్చు, ంందర్."

"థాంక్యూ సర్. ఇప్పుడు నేను చేస్తున్న పని ఆమెకు తెలియనివ్వకండి!" అన్నాను సెలవు తీసుకుంటూ.

8

సుమారు రెండు నెలల క్రితం జరిగింది—

మా బెంగుళూరు కరెస్పాండెంట్ మిస్ ఉమనుంచి ఒక పూర్తి ఇన్వెస్టిగేటివ్ రిపోర్టు అందింది—అక్కడి స్థానిక పారిశ్రామికవేత్త అయిన నరేంద్రపాటిల్ అనే అతన్ని గురించి.

ఆ రిపోర్టు మా పత్రికలో వెలువడి చాలా సంచలనం కలిగించింది. కర్ణాటక అసెంబ్లీలోనూ, పారిశ్రామిక వర్తకులలోనూ—దాని ఫలితంగానే పాటిల్ అరెస్టు కూడా అయి తర్వాత బెయిలుమీద బయటికొచ్చాడు. అతని పూర్తి అక్రమ వ్యాపారాన్ని బయటపెట్టిందా రిపోర్టు. దానికి ప్రతీకారంగా అతడీ దుర్మార్గానికి పూను కున్నట్లు ఇప్పుడు రుజువవుతోంది.

అవును, తొంభై రెండు లక్షలు గంగపాలైతే ఎవరి కోపం ఉడకదు?

కానీ, ఈ అక్రమ వ్యాపారాల్లో పెట్టుబడులంతా పక్కతో కూడుకున్నదేనని తెలిసి కూడా, దానికే మాత్రం వెనుకాడకపోవడం చూస్తే అడ్డదారుల్లో సంపాదించాలని ఎంత బలంగావుందో తెలుస్తుంది. కష్టకాలి ఏ ఆపదైనా ఎదురైతే దాన్నుంచి తప్పించు కునే ఉపాయశీలత ఎంత వున్నదో చాలా కేసుల్లో కృకే తెలియదు!

నరేంద్ర పాటిల్ కి అదిలేదు.

అందుకే అతను పట్టుబడ్డాడు.

ఇప్పుడిలా అడ్డుమార్గాల ద్వారా కక్ష సాధిస్తున్నాడు.

గత కొన్ని మాసాలుగా జరుగుతున్న బొంబాయి టెక్స్ టైల్స్ మిల్లుల సమ్మె మూలంగా అవి మూతపడి, ఉత్పత్తి స్తంభించి, కొంత కాలానికి మధ్య దళారులవద్ద కూడా నిల్వలు అయిపోయి, మార్కెట్ లో కొన్ని పెద్ద కంపెనీల వస్త్రాలకి తీవ్రమయిన కొరత ఏర్పడినప్పుడు, కొనుగోలుదారుల డిమాండ్ ని తీర్చడానికి నరేంద్ర పాటిల్ ఓ కొత్త ఆలోచనతో రంగంలోకి దిగాడు.

ఆ ప్రకారం అహ్మదాబాదు, సూరత్ వంటి చోట్ల చిన్న చిన్న మిల్లులనుంచి భారీ ఎత్తున వస్త్రాల్ని సేకరించి, తన గిడ్డంగుల్లో చేరవేసి, వాటికి నామకరణ మహోత్సవము జరిపించసాగాడు. అలా బొంబే డైయింగ్, మఫత్ లాల్ ముద్రలతో సరుకు కొందరు అవినీతిపరులైన వర్తకుల ద్వారా ప్రజల మధ్యకి దిగసాగింది.... వేగవంతంగా, హెచ్చు మొత్తాలతో లాభాల్ని ఆర్జించి పెట్టసాగింది....

మిస్ ఉమ ఇది పసిగట్టి తన ఆర్టికల్ ద్వార బండారం బైట పెట్టింది.

పోలీసులు మెరుపు దాడి చేసి ఆ గోడవున్స్ లో సరుకు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ తొంభై రెండు లక్షల రూపాయలు. పాటిల్ కి బేడీలువేసి లాకప్ లో బైఠాయించారు. తర్వాత అతను బెయిలుమీద బైకొచ్చాడు. అతనిమీద కేసు నమోదయి కోర్టులో న

స్తోంది....

అందులో తా నెలాగూ శిక్షను తప్పించుకోలేడని తెలుసు. అందుకని ఆలోపులో మామీద పగ తీర్చుకోవాలనుకుని వుంటాడు. అంగరక్షకుడు జూడోకి ఆదేశాలిచ్చి పంపాడిక్కడికి. జూడో మొదట శర్మని గాయపర్చి, వదిలాడు. అతన్ని చంపదల్చుకోలేదు. అసలు కక్ష మా బాస్‌మీద వుంది. బాస్‌ని చంపడానికి నాలుగు రోజులు అవకాశం కోసం చూశాడు. చివరికి మొన్న ప్రయత్నించాడు. కానీ ఫలించలేదు. అప్పుడు పిచ్చెత్తిపోయి నామీదా కిరాయి మనుషులతో ఆఫీసుమీదా పడ్డాడు.

ఆ తర్వాత బాస్‌మీద మరో ప్రయత్నం చేయడానికే ఇక్కడ ఉండిపోయాడు. కానీ అదృష్టం వక్రించి మాకు పట్టుబడిపోయాడు....

అతని కన్‌ఫెషన్ అంతా విన్న తర్వాత ఇక పాటిల్‌కి మూడిందనే అనుకున్నాను. బాస్‌కు హాని తలపెట్టిన వాళ్ళు పశ్చాత్తాపానికి కూడా తెరిపి లేకుండా నశిస్తారు. బాస్ నామీద వేసిన బాధ్యత చాలా బరువైనది. శత్రువు నాశనం కావాలి.

పిస్టల్‌తో అదుగుపెట్టి ఒక్క గుండుతో ప్రాణా లెగరగొట్టడం కష్టంకాదు. సమస్యాకాదు. కానీ బాస్ దాన్నంగీకరించడు. ప్రత్యక్ష హింసను తిరస్కరిస్తాడు. చేసిన పాపానికి శత్రువు మూగగా అనుభవించాలి. దారీ తెన్నూ కానరాక తనకు తానే శిక్షను విధించుకునే గతి పట్టించాలి. అలాటి పరిస్థితిని కల్పించి వదలాలి....

నా బెంగుళూరు ప్రయాణమంతా ఈ ఆలోచనలతోనే గడిచిపోయింది. ఏర్‌పోర్టునుంచి హోటల్ కన్నెమెరా చేరుకొని, గది తీసుకుని స్నానం చేస్తున్నంతసేపూ

ఆలోచించాను ....

మిస్ ఉమ అపార్టుమెంటుకి ఫోన్ చేసి, నా రాకను తెలియజేసి, ఆమెను వెంటనే ఇక్కడికి రమ్మని చెప్పిన తర్వాత, సోఫాలో పడుకుని నిదానంగా ఓ పథకాన్ని రూపొందించుకున్నాను.

మిస్ ఉమ సరిగ్గా ఇరవై నిముషాల్లో వచ్చింది. ఆమెకు పాతికేళ్ళుంటాయి. అచ్చం పోలిక అలాగే లేక పోయినా చూపులు మాత్రం జయసుధవి. జయసుధ లక్షణాలున్న వారెవరైనా సరే నాకు అభిమాన వనితలే.

అభిమాన వనిత మిస్ ఉమ నా రాకకు ఆశ్చర్య పడలేదు. ఆమె అంతకుముందే పేపర్లో వార్త చదివి, హైదరాబాదుకు ఫోన్ చేసి విషయం తెలుసుకుంది. అయితే ఇందులో పాటిల్‌కు సంబంధముందని ముందే చెప్పి ఆమెను కంగారుపర్చలేదు. నేను చెప్పేవరకు ఆమెకు తెలియదు.

“మిస్ ఉమ, పాటిల్ ఎంతకు తెగించాడో చూశారా? బాస్ ప్రాణాలే తీయాలనుకున్నాడు. ఇక్కడ మీకు హాని చేయకపోవడానికి కారణం మన దృష్టి తనమీదికి మళ్ళుతుందనే....”

“నేనిలా జరుగుతుందనుకోలేదు....” అందామె బాధగా, “నా ఇన్వెస్టిగేషన్ బాస్ ప్రాణాలకే ముప్పు తెస్తుందనుకోలేదు...”

“బాధపడకండి. రిపోర్టులు పంపడం మన ధర్మం. అవి తెచ్చే ఆపదల్నుంచి కాపాడుకోవడం బాస్ వంతు. ఇదెప్పుడూ వుండేదే. పాటిల్‌ని తొంభై రెండు లక్షలకి క్షవరం చేసిన ఘనత మీకుంది, అందుకు గర్వపడండి!”

“అతన్ని ఇప్పుడు ఏం చేయాలనుకుంటున్నారు?”

"అదిప్పుడే చెప్పలేను. నాకో ఆలోచన వుంది. కానీ అలా జరుగుతుందని ఆశించలేను. పరిస్థితులు అనుకూలించాలి. వాటికోసం ఎదురు చూడాలి. కాలం పడుతుంది. నిరీక్షణ, సహనం, ఓర్పు మనమీ వృత్తిలో బాగా అలవాటు పడివున్నవాళ్ళం. ముందు అతని పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకుంటే మంచిది.... అతని కుటుంబం, జీవితం, అలవాట్లు, వ్యసనాలు, రహస్యాలు, వ్యవహారాలు, లావాదేవీలు.... ఇవన్నీ...."

"అవన్నీ తెలుసుకొని మీరెలా చావుదెబ్బ తీస్తారు?"

"అది తెలుసుకున్న దాన్నిబట్టి వుంటుంది."

"అతడి జీవితాన్ని నేను లోతుగా తరచి చూడలేదు" అందామె కొంత నిరుత్సాహంగా, "కానీ, మిస్టర్ సుందర్, అతను ఒంటరిగాడు. భార్య ఎప్పుడో విషం తాగి చచ్చిపోయిందట. కూతురు అతన్ని అసహ్యించుకుని ఎక్కడికో వెళ్ళిపోయింది. అతదెవర్నీ దగ్గరికి చేరనివ్వడు, బంధువుల్ని. డబ్బే అతనికి బంధువు. ఇంట్లో ఆ బాడీగార్డు జూడో, కారు డ్రైవరు ఒకడు, ఒక వంటగత్తె, ఓ పనివాడూ వుంటారు. కానీ జూడో తప్ప మిగతావాళ్ళు తమ పనులు పూర్తిచేసుకొని వెళ్ళిపోతారు. జూడో ఒక్కడే అన్ని వేళలా ఇంట్లో వుంటాడు. భోజనం వడ్డించడం దగ్గర్నుంచీ అన్ని సపర్యలూ పాటిల్ కి చేసిపెడతాడు.

"ఇక అతని వ్యసనాలు, అలవాట్లు గురించి నాకేమీ తెలియదు. బిజినెస్ అంతా జయచామరాజ్ రోడ్లోని రెడీ మనీ మాన్షన్ ఆఫీసులో చూస్తాడు. ఏవైనా సీక్రెట్ డీలింగ్స్ వుంటే రాత్రి పది తర్వాత ఇంట్లోనే కలుసుకుంటాడు వ్యక్తుల్ని."

"రోజూ కలుసుకుంటాడా?"

"రోజూ ఒకరిద్దరు వచ్చిపోతూనే వుంటారు?"

"వాళ్ళలో స్త్రీలుంటారా?"

"ఉండవచ్చు. నేను చూడలేదు."

"వాళ్ళని కలుసుకునే గది ప్రత్యేకంగా వుందా?"

"వుంది, హాలు కుడిప్రక్క గది."

నేను ఆలోచించాను. కాస్సేపయ్యాక అన్నాను.

"సరే, మిస్ ఉమ, ఒక పని చెయ్యండి."

"చెప్పండి."

"నాకో కెమేరా, టేప్ రికార్డర్ — దానికి ఎక్స్టర్నల్ మైక్రోఫోన్‌తో కావాలి...."

"అలాగే, నా దగ్గర వున్నాయి, తెస్తాను."

"కెమేరా ఫ్లాష్ గన్ లేకుండా, చాలినంత వెలుతురు లేకపోయినా పనిచేయగలాలి."

"అలాటిది ఇంపోర్టెడ్ కెమెరా నా దగ్గరుంది."

"గుడ్, రాత్రి తొమ్మిది గంటలకి మీరు నాకు పాటిల్ ఇల్లు చూపించి వెళ్ళిపోండి" అన్నాను.

ఆమె తలూపింది అంగీకారంగా.

9

ఒక కారు వచ్చి గేటుదగ్గ రాగింది.

కాంపౌండ్ లోపల గేటు ప్రక్కనే వున్న నేను, జాగ్రత్తగా తల ప్రక్కకు జరిపి చూశాను. కారులోంచి ముగ్గురు దిగారు.

ఆ ముగ్గుర్లో పాటిల్‌ని గుర్తించాను. అతను వంగి డ్రైవర్‌తో ఏదో చెప్తున్నాడు, కన్నడంలో. నాకర్థం గాలేదు. కారు స్టార్టయి వెళ్ళిపోయింది. పాటిల్ గేటు తాళంతీసి లోపలికి వచ్చాడు. అతని వెంట వాళ్ళిద్దరు

వచ్చారు.

ముగ్గురూ బంగళాకేసి వేగంగా నడిచారు.

నేనక్కడే కాచుకున్నాను. వాళ్ళు లోపలికెళ్ళి లైట్లు వెలిగేవరకూ, కిటికీలు తెరచుకునేంతవరకూ అక్కడే వున్నాను.

అప్పుడు హాలు కుడిపక్క గది కిటికీ ముందు వరండా లోకి తెరచుకుంది. గదిలో వాళ్ళు ముగ్గురు కన్పించారు.

గబగబా నడిచి, వరండా దగ్గర బూట్లు విప్పేసి, బ్యాగుతో ఆ గది కిటికీ ప్రక్కన చేరాను.

వాళ్ళు సోఫాల్లో కూర్చుని వున్నారు. కానీ వాళ్ళ మాటలు నాకేమీ అర్థంగావడంలేదు. ఆ వచ్చిన అతిథుల్ని చూస్తే ఏదో రాజకీయ పార్టీకి చెందిన వాళ్ళని అర్థమవుతోంది. కెమెరా ఉపయోగించాలా వద్దా అని ఆలోచించి విరమించుకున్నాను. వాళ్ళ మాటలు నాకర్థంగాకపోయినా, అదేం నాకుపయోగపడే సమావేశంలా లేదు. వాళ్ళు వచ్చే ఎన్నికలకు పార్టీ ఫండ్ కోసం అర్థిస్తున్నట్లు కన్పిస్తోంది. చివరికి పాటిల్ నుంచి ఏదో వాగ్దానం తీసుకుని వెళ్ళిపోయారు.

నిరుత్సాహ పడ్డాను.

అప్పుడు నాకేదో తట్టింది—పాటిల్ పంపిన కారు.

అది తప్పకుండా మరో పార్టీని తీసుకు రావాలి.

అది నా కుపకరించవచ్చు. ఈ అవకాశాన్ని నే నుపయోగించుకోవాలి. పాటిల్ ఇప్పుడు గదిలో లేడు. లోపలెక్కడో ప్లేట్లు, గ్లాసులు చప్పుడు చేస్తున్నాయి. చటుక్కున కిటికీలోంచి గదిలోకి దిగాను. తలుపు దగ్గర కెళ్ళి హాలులోకి తొంగిచూశాను. అతను కన్పించలేదు. వెనుక ఎక్కడో గదిలో చప్పుడవుతోంది.

నేను వేగంగా రంగంలోకి దిగాను. బ్యాగులోంచి పొడవాటి తీగవున్న మైక్రోఫోన్‌ని తీసి టీపాయ్ దగ్గర కూర్చున్నాను. కత్తితో దానికింద తివాసీకి రంధ్రం పెట్టి అందులోకి తీగను పెట్టి కిటికీవైపుకు లాగాను. సరిగ్గా ఆ రంధ్రంలో అమరేలా మైక్రోఫోన్‌ని వుంచాను. తీగ రంగు గోడల రంగులో కలిసిపోయేలా వుంది.

బ్యాగుతో బయటికి దూకేసి, తీగను కిటికీ రెక్క వెనుకనుంచి బయటికి, కింద గచ్చుమీదికి అందేలా లాగాను. దాని చివర జాక్ పిన్ వ్రేలాడుతోంది.

ఏర్పాటు పూర్తిచేసి పాటిల్ కోసం చూశాను. అతడింకా రాలేదు. బయట కారు చప్పుడు విన్పించింది.... నేను చీకటి వరండాలోంచి వురికి ఎడమవైపు తోటలో మొక్కల చాటున వెళ్ళాను.

కారు లోపలికొస్తూండగానే పాటిల్ బయటికి వచ్చాడు.

అతను కారును చేరుకుని అతిథిని రిసీవ్ చేసుకున్నాడు. నేనక్కడ్నుంచే వాళ్ళని గమనిస్తున్నాను. వాళ్ళు చకచకా లోపలికెళ్ళిపోయారు. డ్రైవరు గేటు దగ్గరికెళ్ళి బయటికి చూస్తూ నిలబడ్డాడు.

నేను తిరిగి వరండా చేరుకున్నాను. కిటికీలోంచి లోపలికి చూసిన నాకు పాటిల్ కెదురుగా సోఫాలో కూర్చుని ఒక ఆజానుబాహుడు కన్పించాడు. విదేశీయుడు. అమెరికన్‌లా వున్నాడు. సంభాషణ ఆంగ్లంలో సాగుతోంది. ఇద్దరూ డ్రింక్స్ సిప్ చేస్తున్నారు.

కెమెరాతీసి రెండు స్నాప్స్ లాగాను.

సంభాషణ ఆసక్తికరంగా సాగుతోంది.

బయటికి వేలాడుతున్న మైక్రోఫోన్ జాక్‌పిన్‌ని టేప్‌రికార్డర్ సాకెట్‌లోకి గుచ్చాను. బటన్‌లు నొక్కాను. టేపు తిరగసాగింది....

మరొక స్నాప్ తీసి, మనసును వాళ్ళ సంభాషణ మీదికి కేంద్రీకరించాను.

అప్పుడు నా గుండె దడ హెచ్చింది .... వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో తెలిసివచ్చాక! గాడ్! ఏం మాట్లాడుకుంటున్నారు వాళ్ళు! ఇది నేనూహించలేదు! ఇలాంటివి కూడా జరుగుతాయా?

కళ్ళప్పగించి వాళ్ళనే చూస్తున్నాను .... వాళ్ళ మాటల్లో పదేపదే పన్నెండు కోట్ల రూపాయల ప్రస్తావన వస్తోంది....పన్నెండు కోట్లు! వాళ్ళింకా ఏవో లెక్కలు వేసుకుంటున్నారు....అంకెలు పాటిల్‌ని తృప్తి కల్గిస్తున్నాయి. అమెరికన్ అతన్ని ఒప్పించడంలో కృతకృత్యుడయ్యాడు. డీల్ చూస్తూండగానే సెటిల్ అయిపోయింది. సమావేశం ముగిసింది.

పన్నెండు కోట్ల రూపాయల డీల్! ఓహ్, ఇదే నే నెదురుచూసిన అవకాశం! దీన్ని విడిచిపెట్టకూడదు!

వాళ్ళు బయటకొస్తున్నప్పుడు, అమెరికన్ కారెక్కుతున్నపుడూ రెండు స్నాప్స్ తీశాను.

అక్కడ్నుంచి తిరిగి నేను హోటల్‌కొచ్చేవరకూ నా మనసు మనసులోలేదు! ఎంత గొప్ప అవకాశమిది! ఆ పాటిల్ కూడా వూహించలేదు తనకేమవుతోందో, అయ్యో ఋణంవరకూ! దీంతో చావు దెబ్బ తింటాడు!

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఆ టేపును పదేపదే విన్నాను....

10

ఉదయం వచ్చింది ఉమ, "ఏమయింది, సుందర్?" అంటూ.

నవ్వి ఆమెకు ఆ టేపు విన్పించాను. ఆమె కదల కుండా కూర్చుని నోరు తెరచుకుని వింది. "ఓహ్, ఎంత పెద్ద స్కాండల్! ఏం చేస్తారు?"

"మన పేపర్లో వేస్తే మంచి ఎడ్వర్ టైజు మెంటుగా ఉంటుంది, ఇన్ కంటాక్స్ వాళ్ళకి కదూ? రాబందుల్లా వచ్చి ఎగరేసుకుపోతారు ఆ పన్నెండు కోట్లనీ తమ ఖజానాకి!"

"దీన్నిక తట్టుకోలేడు పాటిల్!"

"గుండె బలహీనమా?"

"తెలీదు. కానీ తట్టుకోలేడు. కనీసం పిచ్చివాడవు తాడు."

"వెల్, మీరీ టేపుకి ఇంకో కాపీతీసి నాకివ్వండి. ఫోటోలు అయిదు తీశాను. బాగానే వచ్చాయనుకుం టున్నాను.... రెండేసి కాపీలుతీసి సాయంత్రానికి అందిం చండి."

"అలాగే."

"మన ఆఫీసుమీద దాడి జరిగిన వార్త మొన్నటి పేపర్లోనే కదూ పడింది? అదొకటి పట్రండి...."

"అలాగే. మీరు బాస్ కు ఫోన్ చేశారా?"

"ఉదయం లేవగానే చేశాను. సాయంత్రం జూడోని వదిలేయమన్నాను."

"మీరేం చేస్తారు?"

"జూడో పాటిల్ ని కలుసుకోగానే రంగ ప్రవేశం చేస్తాను."

"చేసి?"

"మనుషులు తామనుకున్నది అనుకున్నట్టే యెలా జరగదో బోధిస్తాను."

"మీరు ప్రమాదంలోకి వెళ్తున్నారు...."

తల అడ్డంగా వూపాను. "రక్షించుకోగలను. ఒకవేళ నేను గంటలోగా రాకపోతే మీరు మీ పని చేసేయండి."

"పోలీసులతో రావాలా?"

"మంచి బలంగా, దృఢంగా వున్న శాల్తీలు."

"నా మనసేదో కీడు శంకిస్తోంది, మిష్టర్ సుందర్."

"అది మీ స్త్రీ సహజ భయం, మిస్ ఉమ."

ఆమె నిట్టూర్చింది. "అయితే నేను లక్షలే దెబ్బ తీశాను....మీరు కోట్లు కొల్లగొడుతున్నారన్నమాట!"

"లేదు, లేదు. అందులో సగం వాటా మీకూ వుంది. మనిద్దరం కలిసే చేస్తున్నాం."

"అంటే నాకు ఆరు కోట్లన్నమాట .... కానీ కోట్లు నేనేం చేసుకోనూ?"

"నాకూ అదే సమస్య! కోట్లు తో దుక్కే నే అలవాటు నాకు లేదు...."

ఆమె నవ్వింది. నేనూ నవ్వాను.

11

చీకటి పడుతోండగా ఫోన్ మోగి మమ్మల్ని పిచ్చాపాటీలోంచి బయటికి లాగింది.

రాబర్టు పలికాడు. "సుందర్, మన జూడో వీరుడు రాకెట్ స్పీడుతో ఏర్‌పోర్టు కెళ్ళాడు. బెంగుళూరు ఫ్లైట్ ఎక్కాడు...."

"గుడ్. మధ్యలో ఎక్కడయినా ఫోన్ చేశాడా?"

"లేదు, తిన్నగా విమానమెక్కేశాడు. ఇప్పుడే ఏడు గంటలకి బయల్దేరింది విమానం...."

"ఓ.కే, నేనిక్కడ రిసీవ్ చేసుకుంటాను."

"సుందర్, అక్కడంతా సవ్యంగా జరుగుతోందా?"

"ఇంతవరకు సవ్యంగానే జరిగింది...."

"మీరు సక్సెస్ కావాలి. నేనే కాదు, మా మిసెస్ కూడా ప్రార్థిస్తోంది...."

"గాడ్! ఆమెకెలా తెలుసు? నేను వేరే పనిమీద పోతున్నానని చెప్పానే?"

"ఆమె నమ్మలేదు. అది మాకు తెలియనివ్వలేదు. షీ ఈజ్ మోస్టు అండర్‌స్టాండింగ్ ఉమన్, సుందర్. యూ ఆర్ లక్కీ...."

ఫోన్ పెట్టేసి కొత్త ఉత్సాహంతో ఉమవైపు తిరిగాను.

"పదండి, మన జూడో మిత్రుడి ఆగమనాన్ని వీక్షిద్దాం!"

ఏర్‌పోర్టులో సరిగ్గా ఎనిమిదీ పదికి విమానం దిగివస్తూ కన్పించాడు జూడో. మరికొన్ని నిమిషాలయ్యాక లాంజ్‌లోని ఫోన్ బూత్‌లోకి వెళ్తూ కన్పించాడు గబగబా. రెండు నిమిషాల తర్వాత బయట పార్కింగ్ లాట్‌లో టాక్సీ ఎక్కుతూ కన్పించాడు వాడావుడిగా.

అతన్ని మేము అనుసరించాం. మరో టాక్సీలో ఎక్కి కూర్చున్నాం.

"డ్రైవర్, ఆ టాక్సీని వెంటాడాలి. దేనికీ వెంటాడ నవసరంలేదు. బాడుగమీద నీకు యాభై రూపాయలిస్తాం" అంది ఉమ, జూడో యెక్కిన టాక్సీని చూపిస్తూ, డ్రైవర్‌తో.

డ్రైవర్ పోనిచ్చాడు.

"ఫోన్ చేసింది పాటిల్ కి, ఆఫీసులో. అతనిప్పుడు ఇంటికొచ్చేస్తాడు. వాళ్ళిద్దరు ఇంట్లో కలుసుకుంటారు.." అన్నాడు.

"మీ దగ్గర రివాల్వర్ లేదు" అందామె బాధగా.

"అదెందుకు? బ్రీఫ్ కేసులో వున్న ఆయుధాలు చాలు...."

సరిగ్గా ఇరవై నిమిషాల్లో జూడో టాక్సీ పాటిల్ బంగళా చేరుకుంది.

"ఓ. కే, ఇక వెళ్తాను. నాకో సం గంట సేపు చూడండి...." అన్నాను. కొంతదూరంలో టాక్సీనాపి దిగిపోతూ.

ఆమె తలూపింది. టాక్సీ వెనక్కు మళ్ళి వెళ్ళిపోయింది.

నేను పాటిల్ బంగళావైపు అడుగులేశాను. జూడో అప్పుడే గేటు తీసుకుని లోపలికెళుతున్నాడు. అతని టాక్సీ వెళ్ళిపోయింది.

నేను గేటును చేరుకునేటప్పటికి అతను ఇంట్లోకి వెళ్ళిపోయాడు. లోపల కారు కన్పిస్తోంది కానీ డ్రైవరులేడు.

నేను గేటు తీసుకుని లోపలికి నడిచాను....

12

పాటిల్ గొంతు హాలు కుడివైపు గదిలోంచి వినబస్తోంది.

"జూడో! ఏమిటి? ఏమైంది? పని పూర్తిచేశావా?"

నేను నెమ్మదిగా ఆ కిటికీ దగ్గరికి చేరాను. గదిలో అతను సోఫాలో కూర్చుని వున్నాడు ఉద్రేకంగా. జూడో అతనిముందు నిల్చుని చెప్తున్నాడు.

"పూర్తిచేశాను, బాస్! మీరు పేపర్లో చూడలేదా? వాళ్ళందరికీ బుద్ధి చెప్పి వచ్చాను...."

"అతను....మధీందర్ రావ్ నేం చేశావ్?"

జూడో ఛాతీ ఎగరేసి గర్వంగా నవ్వాడు. "ఆ ముసలాడ్ని బాంబు పెట్టి బుర్ర బద్దలుచేశాను, బాస్. హాస్పిటల్లో పడ్డాడు. బ్రతకడంటున్నారు...."

"నిజమా!" పాటిల్ ముఖం సంతోషంతో వెలిగింది, "ఓహ్, అంత నెమ్మదిగా చెప్తావేమిటి! నిజంగా ఆ బాస్టర్డ్ బ్రతకడా?"

"ఇహ బ్రతకడు, బాస్...." జూడో ముఖమంతా చెమటలు పట్టేస్తోంది, తుడుచుకుంటున్నాడు. "అప్పుడే చావాల్సింది, బాస్....కానీ ఎక్కడో లోపం జరిగింది.. మొత్తానికి మనం పగతీర్చుకున్నాం, బాస్! ఇక సంతోషంగా వుండండి...."

"నా పగ తీరింది!" పాటిల్ అరిచాడు, "నా కిప్పుడు తృప్తిగా వుంది! నేనిప్పుడు ఆనందిస్తాను!"

జూడో ముఖంలో రంగులు మారింది. గిల్టీగా చూస్తున్నాడు.

తేరుకొని అడిగాడు పాటిల్, "మరి మిగతా వాళ్ళేమయ్యారు?"

"ఆ ఎడిటర్ కాళ్ళు విరగ్గొట్టాను, బాస్. హాస్పిటల్లో పడ్డాడు. మరో కొత్త ఎడిటర్ వస్తే వాడి బండికి బ్రేకు లూడదీసి పళ్ళూడగొట్టాను. బుర్ర కూడా చిటికింది బస్సుకు గుద్దుకుని. ముసలి ఎడిటర్ ప్రక్కనే పడ్డాడు హాస్పిటల్లో. వాడికేదీ గుర్తుకు రావడంలేదు .... పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. ఇంకా ఆ తర్వాత ఆఫీసుకు నిప్పెట్టేశాను...."

పాటిల్ ఆనందాతిరేకంతో పడీపడీ నవ్వసాగాడు.

నేనిక సహించలేకపోయాను. కిటికీలోంచి లోపలికి గెంతాను.

అదిరిపడి వాళ్ళు నన్ను చూశారు. పాటిల్ నవ్వాపేసి బెదురు చూపులు చూశాడు. జూడో ప్రాణాలెగిరి పోయినట్టు కళ్ళు తేలవేశాడు.

“శభాష్, జూడో! మోర్ డైలాగ్!” అన్నాను నవ్వి.

“ఎవరు—ఎవరున్నవ్వు? కిటికీ దూకి ఎందుకొచ్చావు?” పాటిల్ తేరుకొని గదమాయించాడు.

“దూకడం వచ్చు కాబట్టి....” అన్నాను అతని ముందు సోఫాలో కూర్చుంటూ.

పాటిల్ చటుక్కున జూడోని చూసి అరిచాడు.

“ఎవరితను? ఎలా వచ్చాడు లోపలికి?”

జూడో ఉలిక్కిపడి చూశాడు. అతని ముఖం పాలిపోయింది. ఏదో చెప్పాలని నోరు తెరిచాడుగానీ మాట రాలేదు. విపరీతంగా చెమటలు కక్కుతున్నాడు.

“వాడేం చెప్పలేదు.... నేను చెప్తాను” అన్నాను జూడోని చూసి కొంటెగా నవ్వుతూ, “మీవాడు పళ్ళూడగొట్టానంటున్న కొత్త ఎడిటర్ని నేనే, సోమసుందర్ పేరు. కానీ నా పళ్ళు ఒక్కటీ వూడలేదు. చూడండి, పై సెట్టు కింద సెట్టూ యెంత బలంగా వున్నాయో మిలమిల మెరుస్తూ. రోజూ రెండుసార్లు తోముతుంటాను. ముసలాడ్నయినా వూడిరావు....”

“అబద్ధం!” జూడో గొంతు చించుకున్నాడు, “నువ్వబద్ధం!”

వాడలా అరిచి నామీద కొచ్చాడు. వాడి చర్యను

వాడికంటే ముందే పసిగట్టి నేను లేచి దళసమీద గుద్దాను. గిర్రున తిరుగుతూ వెళ్ళి తలుపుకు కొట్టుకున్నాడు.

వెనకనుంచి పాటిల్ వెర్రికేక వేశాడు.

జూడో వూడి కిందపడ్డాడు.

తేలికపడుతూ నేను తిరిగి పాటిల్ దగ్గరకొచ్చి కూర్చున్నాను. "చూశారా? మీవాడు మీరనుకున్నంత బలవంతుడేమీ కాడు. విశ్వాసపాత్రుడూ కాడు. వాడు మీకు చెప్పిందంతా అబద్ధమని ఇప్పుడు నన్ను చూస్తే తెలియడంలేదూ?"

"బాస్, నమ్మకండి! అతడెవరో బోగస్! నేను చెప్పిన ఎడిటర్ ఇతను కాడు!" లేచివస్తూ అరిచాడు జూడో.

పాటిల్ మా యిద్దర్నీ తికమకగా చూశాడు.

నేను తలూపి బ్రీఫ్‌కేసు తెరిచాను. అందులోంచి మొన్నటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తీసి చూపించాను. "ఈ ఫోటో చూడండి! వర్సింగ్ హోంలో ఎడిటర్ శర్మ పక్కనున్నదెవరు—పోల్చుకున్నారా?"

పాటిల్ ఫోటోని చూస్తూ చటుక్కున నన్ను చూశాడు. అతడి కళ్ళు నన్ను నమ్మాయి.

జూడో ముఖం వెలవెలబోయింది.

"కాబట్టి మీవాడు చెప్పింది అబద్ధమని నమ్ముతారా?" అడిగాను పాటిల్‌ని, "బుకాయిస్తున్నాడు.... మా బాస్‌కేం కాలేదు. శర్మ రెండు కాళ్ళూ విరగలేదు. ఆఫీసును తగలబెట్టనూలేదు. పైపెచ్చు మాకు చిక్కిపోయి మీ గురించి అంతా కక్కేశాడు!"

"ఏమిటీ!"

"నమ్మకండి, బాస్! నమ్మకండి—"

నేను నవ్వి బ్రీఫ్‌కేసులోంచి లాకెట్ తీసి చేతిలో

వూపాను.

దాన్ని గుర్తుపట్టాడు పాటిల్. జూడోని చూసి కళ్ళు అగ్నిగోళాలయ్యాయి.

నేను బ్రీఫ్ కేసులోంచి టేప్ రికార్డర్ తీశాను. అందులో ఒక కేసెట్ వేశాను.

"మీవాడికి సంగీతం వచ్చు .... ఇందులో మీవాడి కీర్తనలూ, మధ్య మధ్యలో శ్లోకాలూ వున్నాయి.... మీరు సంగీత ప్రియులైతే ఇది మిమ్మల్ని బాగా ఆకట్టుకుంటుంది, వినండి!"

దాన్ని ఆన్ చేసి వదిలాను.

టేపు తిరుగుతూ అందులోంచి శబ్దాలు వెలువడుతూంటే, మధ్యలోనే పాటిల్ చివాలున లేచివెళ్ళి జూడో గొంతు పుచ్చుకున్నాడు.

"నువ్వేం చేశావ్ బాస్టర్డ్! ఏమిటిదంతా!"

"ఓహ్, బాస్! మీరిదంతా నమ్ముతున్నారా! ఇతను బోగస్! ఆ టేపులో నా గొంతును ఫేక్ చేశాడు! ఆ మాటలు నావికాదు—"

పకపకా నవ్వాను, "నీవి కావూ?" అంటూ బ్రీఫ్ కేసులోంచి మూడు ఫోటోలుతీసి టీపాయ్ పైన విసిరాను. "చూడండి, మిస్టర్ పాటిల్, ఈ ఫోటోల్లో మీ వాడికేం గతిపట్టిందో చూడండి! వాడి ప్రక్కన నన్ను కూడా చూడండి....ప్రశ్నిస్తున్నాను."

పాటిల్ ఫోటోలు చూస్తోంటే, జూడో సన్నగా వణకసాగాడు. అతను పారిపోవడానికి సిద్ధంగా వున్నాడు. కానీ కాళ్ళు సహకరించడంలేదు.

"యూ బ్లడీ బాస్టర్డ్!" పాటిల్ ఒక్క కేకతోవెళ్ళి జూడో కాలరు పట్టుకొని చెంపమీద బలంగా కొట్టాడు.

“సూవర్ కే బచ్చే! ఇంత మోసం చేస్తావా? నన్ను బుకాయిస్తావా? నువ్వింత ద్రోహం చేస్తావా, యూ కవడ్లీ బాస్టర్డ్! నిన్నిక వదలను! నువ్విలా వుండకూడదు! పిరికిగొడ్డుని నా కళ్ళముందు సహించను-సహించలేను-”

విసురుగా కదిలి పాటిల్ కబ్బోర్డులోంచి రివాల్వర్ ని తీశాడు. దానికి సైలెన్సర్ వుంది. అది చూసి జూడో తటాలున ప్రక్కకు దూకేయబోయాడు. కానీ ఆలోపే నిశ్శబ్దంగా దూసుకొచ్చిన బుల్లెట్ అతన్ని కదలనీయలేదు. నిల్చున్నచోటే పడగొట్టింది.

అతను మరి కదల్లేదు. మారు మాటాడలేదు.

“వెల్?” అన్నాను పాటిల్ ని ఆసక్తిగా చూస్తూ, “ఇప్పుడు?”

అతను రివాల్వర్ తో గబగబా వచ్చి, జూడో శరీరాన్ని తన్ని వెల్లకిలా తిప్పాడు. గుండె ప్రాంతం లోంచి కారుతున్న రక్తాన్ని కింద అదే రంగు కార్పెట్ పీల్చుకుంటోంది....

“నో డౌట్, వాడి పని పూర్తిచేశారు” అన్నాను.

అతను రివాల్వర్ గురిపెట్టి నా వైపు తిరిగాడు. “ఇప్పుడు నీ పని పూర్తిచేస్తాను....” కర్కశంగా వుంది అతని గొంతు. క్రూరంగా చూస్తున్నాడు.

నేను నవ్వాను. అతను కలవరపడేంత గట్టిగా నవ్వాను. “కూర్చోండి, మిష్టర్ పాటిల్!” అన్నాను వ్యంగ్యంగా, “ముందు రిలాక్సవండి! మాట్లాడుకోవల్సింది చాలా వుంది....బలాబలాలు తర్వాత తేల్చుకోవచ్చు. మీరా ఆవేశం మానండి. ఆవేశంలో ఒక హత్యచేసేశారు. ఆవేశంలో నేనూ కొన్ని పనులు చేశాను. ఆవేశం మనిషికి మంచిది కాదంటాను. కూర్చోండి మిష్టర్ పాటిల్!”

అతడింకా కలవరం చెందుతూ, రివాల్వర్‌ని దించేసి, వచ్చి కూర్చున్నాడు.

"ఇప్పుడు మీరు చట్టానికి పట్టుబడ్డారే అనుకోండి... ఏమవుతుంది? ఉరిశిక్ష పడదు. యావజ్జీవితమూ జైల్లో మగ్గరు. ఆఫ్టరాల్, మీ థగ్ సమాజానికి ఉపయోగ పడనివాడు. కొరగానివాడు. మీ డబ్బూ, పలుకుబడీ, సోషల్ స్టేటస్ యాథృచ్ఛికంగా మీకు శిక్షను తగ్గిస్తాయి.

మీరు బయటికొచ్చినప్పుడు బ్రతుకు తెరువు వెతుక్కో నవసరంలేదు. డబ్బే మీకు బంధువు. ఇక్కడంతా పోయినా, మరెక్కడో ఎంతో మిమ్మల్నప్పుడు ఆదు కుంటుంది, బంధువు కంటే మిన్నగా మీరక్కడ స్విస్ బ్యాంకిలో కూడబెట్టిన సొమ్మే మీకు రక్ష. ఆ పన్నెండు కోట్లూ పదహారు కోట్లవుతాయి. పదహారు యిరవై అవుతాయి. యిరవై పాతిక అవుతాయి.... పెరిగే దేకాని, తరిగేది కాదు. మీరు విడుదలై వచ్చి దర్జాగా బ్రతుకు వెలగబెట్టొచ్చు...."

అతను షాక్ తిన్నట్టు చూశాడు. "ఏమిటి? ఏమిటి నువ్వనేది?"

"ఫ్యాక్ట్స్, మిష్టర్ పాటిల్, వాస్తవాలు. అందుకే ఆవేశం వద్దన్నాను. శాంతంగా వినండి.... యూసీ మిష్టర్ పాటిల్, మీ స్విస్ బ్యాంకి సీక్రెట్ అక్కౌంటులో పన్నెండుకోట్ల రూపాయల నల్లడబ్బు మూల్గుతోందన్న సంగతి ఇప్పుడు మీ ఒక్కరికే తెలిసిన రహస్యం కానే కాదు. స్విస్ బ్యాంకిల ఖ్యాతి ప్రపంచంలో ఎవరికీ తెలియనిదీకాదు.

నిన్న మిష్టర్ జాన్ రోజర్స్‌తో మీ సమావేశాన్ని బట్టి, ఆ రొక్కాన్ని అతడి దేశానికి చెందిన అమెరికన్

బ్యాంకికి తరలించే ఆలోచనలో వున్నట్లు తెలుసుకున్నాను. అంతేనా? అతను మీ శ్యాపుకి సీక్రెసీ గ్యారంటీ ప్లస్ స్విస్ బ్యాంకిలలోకంటే అధిక శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నాడు. అవునా? వెల్, సహజంగానే వాళ్ళ దేశంలో వడ్డీరేటెక్కువ. స్విస్ బ్యాంకిల క్లయింట్స్‌ని ఇలా తమ బ్యాంకికి ఆకర్షించే ప్రయత్నంలో కన్విన్స్ చేస్తూ దేశంలో తిరుగుతున్నట్లు అనిపిస్తున్నాడు మిస్టర్ జాన్ రోజర్స్....అంతే కదూ?"

అతను స్తబ్దుడైపోయి చూస్తున్నాడు. నెత్తురంతా తోడేసినట్టుంది ముఖం.

నేను బ్రీఫ్ కేసులోంచి మరికొన్ని ఫోటోలూ, మరో కేసెట్ తీసిచ్చాను. "మిస్టర్ జాన్ రోజర్స్‌తో మీ ఛాయాచిత్రాలు...సంభాషణాసారం..ఈ శబ్ద, ఛాయా గ్రహణాలు మిమ్మల్ని కన్విన్స్ చేస్తాయి....వీటి మరో సెట్టు నా ఫ్రెండు వుంచుకుంది...."

"ఎందుకు! ఎందుకు చేశావీ పని!" తేరుకుంటూ బలహీనంగా అడిగాడతను.

"అర్థంలేని ప్రశ్న! మీ మనసేతిని అర్థం చేసుకోగలను. మీరు దెబ్బకు దెబ్బతీయాలనుకున్నారు. మేం ఎదురుదెబ్బతీశాం, అంతే. నా బాస్‌ని బాస్టర్డ్ అన్నవాడు మనిషికి పుట్టినవాడు కాదు. తప్పులు బయటపెట్టారన్న కక్షతో పత్రికలపై దాడిచేసేవాడు భూమ్మీద వుండ తగ్గవాడు కాదు.

నా బాస్ వున్న వాస్తవాలే లోకానికి ప్రకటిస్తున్నాడు. ఎవరిమీదా ఏ కక్షతో అవాకులూ చెవాకులు అల్లడంలేదు. పత్రికా నిర్వహణ పవిత్రమైన బాధ్యత.

లోకంలో జరిగే అన్యాయాక్రమాలు తెలుసుకోవడానికి ప్రెస్‌ని మించిన మీడియాలేదు ప్రజలకి. దాన్ని గౌరవించడం మీలాంటి కొందరికి తెలియదు. దానివల్ల మీకే నష్టంవాటిల్లినా అందుకు కోర్టులున్నాయి, చట్టాలున్నాయి. అది మాని ఇలా అడ్డుమార్గాల ద్వారా మమ్మల్ని సాధించ పూనుకుంటే, అందుకు తగ్గ సమాధానం మేమూ ఇవ్వగలం!"

అతను నోరు తెరచుకుని చూస్తున్నాడు. రివాల్వర్ చుట్టు చెయ్యి బిగుసుకుంటోంది....

"సమాధానం — ఎలా వుంది మా సమాధానం?" అన్నాను కసిగా నవ్వి, "మమ్మల్ని తక్కువ అంచనా వేశారు. మాతో చెలగాటం చావుతో సమానం. ఇప్పుడు మిమ్మల్ని హంతకుడ్ని చేసి వదిలాను. రేపు కోర్టుకి దివాలా తీయిస్తాను! మీ బ్లాక్ మనీ బండారం మా పత్రికలో రావడమే తడవు — ఆ పన్నెండు కోట్లూ బొట్లులా పేలిపోతాయి! బొట్లులా! బూడిద! తట్టుకుంటారా? ఇప్పుడు మీ చేతులమీద శవం వుంది — రేపు నెత్తిమీద ఐ.టి. వాళ్ళుంటారు! ఇక ఎలా ఎదుర్కొంటారో ఎదుర్కోండి, మీ ఖర్మ! ఇదే మీకు శిక్ష!"

లేచి బ్రీఫ్‌కేసులో నేను తెచ్చిన వస్తువులన్నీ వేసుకుని, విజయగర్వంతో అతడ్ని చూశాను. అతనెటో శూన్యంలోకి చూస్తున్నాడు .... చేతివేళ్ళు రివాల్వర్ పై సైలెన్సర్ గొట్టాని విప్పుతున్నాయి....

"గుడ్ బై, మిస్టర్ పాటిల్! ఇక వెళుతున్నాను...."

"ఆగు!" అతను గభాల్న లేచి నా ముందుకొచ్చాడు "నువ్వు—నువ్వు దీన్నాపలేవా? నన్ను కాపాడలేవా? ప్లీజ్...."

"మిమ్మల్ని కాపాడేకంటే ఎందులోనైనా దూకి చస్తాను!"

"నీ కెంత డబ్బయినా యిస్తాను, ఆలోచించు!"

"డబ్బు! ఎవరికి కావాలి డబ్బు! వెధవ డబ్బు! నేను నా బాస్‌ని తృప్తిపరచాలి! మీ సర్వనాశనం చూడాలి! అర్థమవుతోందా! మీరు మమ్మల్ని నాశనం చేయాలనుకున్నారు—అది కక్ష. నేను మీకు గుణపాఠం చెప్పాను-ఇది శిక్ష! అనుభవించండి! దీన్నెలా ఎదుర్కొంటారో, ఏం చేసుకుంటారో నాకనవసరం! తెలిసిందా? నాకన వసరం పోండిక!"

ఆవేశంగా అని, నేనక్కడ్నుంచి వెంటనే బయట కొచ్చేశాను.

నా వెనుక ఏం జరుగుతుందో నేను గేటు దాటేవరకు తెలియదు. అప్పుడు వినిపించింది....లోపలినుంచి పెద్ద శబ్దం. ప్రేలుడు. అప్పుడూ నేను పట్టించుకోలేదు. అతడు చావే తనకు పరిష్కారమనుకుంటే నా కభ్యంతరం లేదు. పెద్ద చప్పుడుతో చావాలనుకుంటే మరీ సంతోషం!

దీంతో నా బాస్ నాపై వేసిన బాధ్యతను సక్ర మంగా పూర్తిచేశానన్న తృప్తి కలిగింది, నాకిది చాలు! ఈ తృప్తితో వెళ్ళి ఇప్పుడాయన ముందు ధైర్యంగా, గర్వంగా తలెత్తుకు నిలబడతాను. ఆయన అభినందన లందుకుంటాను. ఆ పైన నా శ్యామల చల్లని వొడిలో వాలి సేద తీర్చుకుంటాను....

ఇంతకంటే ఏ మగవాడూ కోరుకునేది లేదు—తన బాస్ అభినందన, అర్ధాంగి లాలన.

—:ఐ పో యిం ది:—